www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

FLASH INDIA NEWS

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక : 158 | మంగళవారం 28.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

# నిరసన అంటే లాఠీచార్జి కాదు




## ప్రజాస్వామ్యంలో నిరసనలకు ప్రత్యేక స్థానం

- పోలీసుల బలప్రయోగంపై స్వతంత్ర విచారణకు డిమాండ్
- సీసీటీవీ, బాడీ కెమెరా ఫుటేజ్ భద్రపరచాలని ఆదేశం
- నిరసనకారుల హింసపై కూడా నిష్పక్షపాత దర్యాప్తు
- పోలీసుల ప్రాణాలూ విలువైనవే: సుప్రీంకోర్టు
- దేశవ్యాప్తంగా నిరసనలకు ఏకరీతి మార్గదర్శకాలు అవసరం
- నిరసన హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు

05

### విద్యార్థులపై ఏకే-47తో కాల్పులు..

పోలీస్ కానిస్టేబుల్ సస్పెన్షన్

### మతం మారితే ఎస్సీ హోదా వర్తించదు

హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు

# జెన్ జీ తో సాధ్యమయ్యేనా?

## దూసుకొస్తున్న 'రిజర్వేషన్ హటావో మూవ్‌మెంట్'

అజిత్ అనే వ్యక్తి ఆర్‌హెచ్‌ఏ పేరుతో ఇన్ స్టా గ్రామ్ ఖాతాను ప్రారంభించగా అతి తక్కువ కాలంలోనే లక్షల్లో ఫాలోవర్స్ పెరగడం ఇప్పుడు దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అవుతోంది. ప్రస్తుతం ఈ ఖాతాకు 4.2 మిలియన్ ఫాలోవర్స్ రావడం ఇదంతా కేవలం గంటల వ్యవధిలోనే జరిగిపోవడం దేశవ్యాప్తంగా రిజర్వేషన్ల విధానంపై సరికొత్త చర్చ ప్రారంభానికి దారి తీసింది. అనేక మంది నెటిజన్లు ఈ ఉద్యమానికి మద్దతుగా పోస్టులు చేస్తున్నారు. మద్దతు తెలపాలంటూ కామెంట్స్ చేస్తున్నారు.




- రిజర్వేషన్ల విధానంలో మార్పుల డిమాండ్
- కుల ప్రస్తావన లేని చట్టం కోరుతున్న ఉద్యమం
- విద్య, ఉద్యోగాల్లో ప్రతిభకు ప్రాధాన్యం కోరుతున్న ఆర్‌హెచ్‌ఏ
- రాజకీయాలకు సంబంధం లేదని ఆర్‌హెచ్‌ఏ స్పష్టీకరణ
- కుల వివరాల నమోదు నిలిపేయాలని డిమాండ్

05

# సీఎం రేవంత్ 'నయా ఫార్ములా'!


## ఖాళీ పోస్టుల భర్తీకి టీపీసీసీ కసరత్తు

### మాకూ ఓ చాన్స్ ఇవ్వండి అంటున్న నేతలు

- పార్టీలో అసంతృప్తికి చెక్ పెట్టే రేవంత్ ఫార్ములా
- నామినేటెడ్ పదవులకు బదులుగా టికెట్ హామీ?
- డీలిమిటేషన్ వ్యూహంతో అసమ్మతికి చెక్
- అసెంబ్లీ, లోక్‌సభ టికెట్లతో సీనియర్లకు భరోసా
- టికెట్ హామీని ఎంతమంది అంగీకరిస్తారు?
- నామినేటెడ్ పదవుల కోసం కొనసాగుతున్న తీవ్ర పోటీ
- కాంగ్రెస్‌లో పదవుల పంపకంపై ఉత్కంఠ
- ఎవరికీ దక్కనున్నాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు?
- కార్పొరేషన్ చైర్మన్ పదవుల భర్తీపై ఉత్కంఠ
- రాబోయే రోజుల్లో నియోజకవర్గాల పునర్విభజన జరగడం ఖాయం !

03

### పాతవారికి రెన్యూవల్.. కొత్తవారికి అవకాశం?



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**
తెలంగాణలో వివిధ కార్పొరేషన్లు, ఫెడరేషన్ల చైర్మన్ల పదవులపై భర్తీపై ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో 2024 జులైలో మొత్తం 37 మందికి ప్రభుత్వం కార్పొరేషన్ పదవులు ఇచ్చింది. వీరి రెండేళ్ల కాలపరిమితి పూర్తయింది. దీంతో ఖాళీ అయిన ఈ స్థానాలతో పాటు పెండింగ్‌లో ఉన్న మరో 50కి పైగా కార్పొరేషన్ చైర్మన్ల భర్తీకి టీపీసీసీ కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో పదవులు తిరిగి దక్కించుకునేందుకు, ఎలాగైనా తమ టర్మ్ ను మరో దఫా రెన్యూవల్ చేయించుకునేందుకు తాజా మాజీ చైర్మన్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం పార్టీ పెద్దలు, తమ గాడ్ ఫాదర్ల వద్దకు క్యూ కడుతుండగా మరికొందరు ఏకంగా ఏఐసీసీ స్థాయిలో లాబీయింగ్ చేయిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది.

**మాకూ ఓ చాన్స్ ఇవ్వండి ప్లీజ్..**

అయితే మొదటిసారి పదవులు ఇచ్చాక ఆయా సంస్థల్లో ఏం జరుగుతుందో అర్థం...






# విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు

### రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షల మంది విద్యార్థులకు వేడి అల్పాహారం

## ప్రజల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం.. విమర్శలు అనవసరం

- ఏ బిడ్డా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్నదే ప్రభుత్వ సంకల్పం
- మానవ వనరుల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి మూలాధారం
- రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షల మంది విద్యార్థులకు వేడి అల్పాహారం
- హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఆధునిక కిచెన్లు
- మిడిమిడి జ్ఞానంతో ఉచిత పథకాలపై విమర్శలు
- ప్రజా సంక్షేమాన్ని అర్థం చేసుకోకుండా ప్రతిపక్షాల విమర్శలు
- ఉచిత పథకాలు ఖర్చు కాదు.. ప్రజలపై పెట్టుబడి

03

# 'హైడ్రా' చీఫ్‌గా తొలగించాలి

## కోర్టుకు క్షమాపణలు చెప్పిన రంగనాథ్

- కొత్త అధికారిని నియమించాలని ప్రభుత్వానికి సూచన
- 63 కోర్టు ధిక్కరణ కేసులపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- లోతుకుంట భూముల వివాదంలో హైడ్రా వ్యవహారంపై విచారణ
- కోర్టు ఉత్తర్వులను పట్టించుకోలేదని న్యాయస్థానం అసంతృప్తి
- హైకోర్టుకు అఫిడవిట్ సమర్పించిన ఏ.వి. రంగనాథ్
- న్యాయస్థానానికి క్షమాపణలు తెలిపిన హైడ్రా కమిషనర్
- పిటిషనర్ తప్పుడు సమాచారం ఇచ్చారని రంగనాథ్ వివరణ

02





# మా పెద్ది సుదర్శన్‌ను కాపాడండి

- ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో కేసీఆర్ సమీక్ష
- ప్రపంచ స్థాయి వైద్యం అందిస్తున్నామని వైద్యుల వెల్లడి
- మెదడు స్పందనకు మరో 48 గంటలు కీలకం
- విదేశీ నిపుణుల సలహాలతో చికిత్స కొనసాగింపు


02



# విజయ్ ప్రభుత్వ ఉత్తర్వులు రద్దు

- కరూర్ తొక్కిసలాట బాధితులకు ఉద్యోగాల ఉత్తర్వులు రద్దు
- ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టు కీలక తీర్పు
- బాధిత కుటుంబాలకు కారుణ్య నియామకాలపై బ్రేక్
- తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది

02



# రూ.2.10 కోట్లకు పైగా టోకరా.!

## వ్యవసాయ భూముల పేరుతో మోసం

- ముగ్గురు బాధితుల నుంచి రూ.2.10 కోట్లకుపైగా కాజేసిన కేటుగాళ్లు
- ఫారెక్స్ ట్రేడింగ్ పేరుతో రూ.33 లక్షల టోకరా
- అధిక లాభాల ఆశతో పెట్టుబడి.. చివరికి భారీ మోసం
- వాట్సాప్ నకిలీ సందేశంతో రూ.67 లక్షలు స్వాహా
- వ్యాపార భాగస్వామి పేరుతో అకౌంటెంట్‌ను బురిడీ కొట్టించిన మోసగాళ్లు
- రష్యా వ్యవసాయ భూముల పేరుతో రూ.1.10 కోట్ల మోసం
- విదేశీ పెట్టుబడుల పేరుతో నమ్మించి డబ్బులు దోచుకున్న సైబర్ గ్యాంగ్

02

ఫారెక్స్ ట్రేడింగ్ పేరుతో రూ.33 లక్షల స్వాహా

# కేసీఆర్ మొండి వైఖరితోనే...




- సింగరేణి దుస్థితికి కేసీఆరే కారణం: కిషన్ రెడ్డి
- కేసీఆర్ మొండి వైఖరితో సింగరేణికి తీవ్ర నష్టం
- బొగ్గు గనుల వేలానికి దూరంగా ఉండటమే సంస్థ వెనుకబాటుకు కారణం
- సింగరేణిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారు
- నైని కోల్ బ్లాక్ అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వమే చొరవ
- ఒడిశాలో పెండింగ్ అనుమతులు పూర్తిచేశాం
- తాడిచర్ల-2 బ్లాక్ సింగరేణికి కేటాయింపు
- జెన్కో పోటీ నుంచి తప్పుకోవాలి సీఎంకు కిషన్ రెడ్డి విజ్ఞప్తి
- విద్యార్థుల్లో ధైర్యం నింపాల్సిన బాధ్యత అందరిది

03

**మూడు కొత్త బ్లాకులతో 6,500 ఉద్యోగాల అవకాశాలు**

**రూ.1.95 లక్షల కోట్ల టర్నోవర్ సాధించే అవకాశం**

# కారుతో నేరుగా పోలీసుల పైకే

డ్రగ్స్ మత్తులో పోలీసులపైకి కారు దూసుకెళ్లిన యువకుడు..

కానిస్టేబుల్‌కు కాలు ఫ్రాక్చర్.!

హత్యాయత్నం కేసుతో పాటు పలు సెక్షన్ల కింద కేసులు

డ్రగ్స్ వ్యవహారంపై కొనసాగుతున్న విచారణ

05

**పోలీసుల అప్రమత్తతతో నిందితుడు అదుపులోకి**



# రూ.2.10 కోట్లకు పైగా టోకరా..!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతులతో ప్రజలను లక్ష్యంగా చేసుకుంటూ భారీ మోసాలకు పాల్పడుతున్నారు. ఫారెక్స్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు, వాట్సాప్ ద్వారా వ్యాపార భాగస్వామి పేరుతో నకిలీ సందేశాలు, విదేశీ వ్యవసాయ భూముల్లో పెట్టుబడుల పేరుతో ముగ్గురు బాధితుల నుంచి రూ.2.10 కోట్లకు పైగా కాజేసిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ మూడు ఘటనలపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**ఫారెక్స్ ట్రేడింగ్ పేరుతో రూ.33 లక్షల స్వాహా:**

కొండాపూర్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి సోషల్ మీడియాలో కనిపించిన ఫారెక్స్ ట్రేడింగ్ ప్రకటనను చూసి మోసగాళ్ల వలలో చిక్కుకున్నాడు. ప్రకటనలోని లింక్ ద్వారా వాట్సాప్ గ్రూపులో చేరిన బాధితుడికి అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. మొదట రూ.1 లక్ష పెట్టుబడి పెట్టించిన నిందితులు, తర్వాత నష్టాలు వచ్చాయని చెబుతూ మరిన్ని పెట్టుబడులు పెట్టించారు. ఈ క్రమంలో బాధితుడు మెత్తం రూ.40.30 లక్షలు వివిధ ఖాతాల్లో జమ చేశాడు. అయితే మోసగాళ్లు కేవలం రూ.7.30 లక్షలు మాత్రమే తిరిగి చెల్లించి, మిగిలిన రూ.33 లక్షలతో పరారయ్యారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**వాట్సాప్ మెసేజ్‌తో రూ.67 లక్షల టోకరా:**

గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న అకౌంటెంట్‌ను సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుని రూ.67 లక్షలు కాజేశారు. వ్యాపార భాగస్వామి పేరుతో కొత్త మొబైల్ నంబర్ నుంచి వాట్సాప్ సందేశం పంపిన మోసగాళ్లు, వాట్సాప్‌లో పూర్తి పేరు కనిపించేలా ఏర్పాటు చేసి అకౌంటెంట్‌లో నమ్మకం కల్పించారు. దీనితో జులై 16 నుంచి 22 మధ్య నిందితులు సూచించిన విధంగా వివిధ బ్యాంకు ఖాతాలకు మొత్తం రూ.67 లక్షలు బదిలీ చేశాడు. ఆ తర్వాత కూడా మరో రూ.25 లక్షలు పంపాలని జులై 25న సందేశం రావడంతో అనుమానం వచ్చిన బాధితుడు అసలు వ్యాపార భాగస్వామిని సంప్రదించాడు. దీంతో ఇది సైబర్ మోసమని గుర్తించి గచ్చిబౌలి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

**వ్యవసాయ భూముల పేరుతో మోసం:**

నల్లగండ్లకు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి రష్యాలో వ్యవసాయ భూముల్లో పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించి సైబర్ నేరగాళ్లు రూ.1.10 కోట్లు కాజేశారు. 100 ఎకరాల వ్యవసాయ భూమిలో పెట్టుబడి పెడితే కేవలం మూడు నెలల్లోనే రూ.27 లక్షల లాభం వస్తుందని ఆశ చూపిన నిందితులు, అవసరమైతే రష్యాకు కూడా తీసుకెళ్తామని చెప్పి బాధితుడిలో విశ్వాసం కల్పించారు. దశలవారీగా భారీ మొత్తాన్ని వసూలు చేసిన తర్వాత ఎలాంటి లాభాలు రాకపోవడంతో బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి బ్యాంకు ఖాతాలు, డిజిటల్ లావాదేవీలపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ వరుస ఘటనల నేపథ్యంలో సైబర్ క్రైమ్ పోలీసులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా ప్రకటనలు, వాట్సాప్ సందేశాలు లేదా విదేశీ పెట్టుబడుల పేరుతో వచ్చే అధిక లాభాల ఆఫర్లను నమ్మి డబ్బులు బదిలీ చేయవద్దని హెచ్చరించారు. పెట్టుబడులు పెట్టే ముందు సంబంధిత సంస్థల విశ్వసనీయతను తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలని, అనుమానాస్పద లింకులు, కొత్త నంబర్ల నుంచి వచ్చే ఆర్థిక లావాదేవీల సూచనలను నిర్ధారించకుండా పాటించవద్దని సూచించారు. ఎలాంటి సైబర్ మోసం జరిగినా వెంటనే సమీప సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లేదా జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని పోలీసులు తెలిపారు.

# 'హైడ్రా' చీఫ్‌గా తొలగించాలి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ వ్యాప్తంగా వార్తల్లో నిలిచిన 'హైడ్రా' కమిషనర్, ఐపీఎస్ అధికారి ఏ.వి. రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊహించని షాక్ తగిలింది. వరుస కోర్టు ధిక్కరణ కేసులపై విచారణ జరిపిన న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. రంగనాథ్‌ను వెంటనే హైడ్రా కమిషనర్ పదవి నుంచి తప్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)ని ఆదేశించింది. అంతేకాకుండా, ఆయన స్థానంలో మరో అధికారిని నియమించాలని ప్రభుత్వానికి సూచించింది.

**లోతుకుంట భూముల వివాదం.. కోర్టు ఆగ్రహం**

సికింద్రాబాద్ సమీపంలోని లోతుకుంట సర్వే నెంబర్లు 1, 2 పరిధిలో ఉన్న 40 ఎకరాల భూములకు సంబంధించి 'శాంతా శ్రీరామ్ కన్స్ట్రక్షన్స్' వేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ హైడ్రా అధికారులు తమ భూముల్లోకి వచ్చి జోక్యం చేసుకుంటున్నారని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. ఏకంగా 63 కోర్టు ధిక్కరణ కేసులు ఒక్క అధికారిపైనే ఉండటం ఏంటని ప్రశ్నించింది. కోర్టు ఉత్తర్వులను పదే పదే లెక్కచేయకపోవడంపై అసహనం వ్యక్తం చేసింది.

**కోర్టుకు క్షమాపణలు చెప్పిన రంగనాథ్**

హైకోర్టు ఆదేశాల మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ కోర్టులో అఫిడవిట్ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన న్యాయస్థానానికి క్షమాపణలు తెలుపుతూ.. తనకు కోర్టుల అన్నా, న్యాయ వ్యవస్థ అన్నా ఎంతో నమ్మకం, గౌరవం ఉన్నాయని పేర్కొన్నారు. లోతుకుంటలోని ఆ 40 ఎకరాల స్థలంలోకి హైడ్రా సిబ్బంది అసలు వెళ్లలేదని, పిటిషనర్ కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారని రంగనాథ్ తన అఫిడవిట్‌లో వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే, కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘనల తీరుపై తీవ్రంగా ఉన్న హైకోర్టు, ఆయనను బాధ్యతల నుంచి తొలగించాల్సిందేనని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# రేపటి వరకే డెడ్‌లైన్..

## కేంద్రానికి 'కాక్రోచ్ జనతా పార్టీ' అల్టిమేటం




**న్యూ ఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం నిరసనకారులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో ఘోరంగా విఫలమైందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మండిపడ్డారు. చర్చల్లో భాగంగా నిరసనకారులపై నమోదైన కేసులన్నింటినీ ఎత్తివేస్తామని హామీ ఇచ్చిన కేంద్రం, ప్రస్తుతం ఆ మాటను పక్కనబెట్టిందని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం సౌరవ్ దాస్ మీడియాతో మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల్లో నిరసన తెలిపిన విద్యార్థులపై మళ్లీ కొత్తగా కేసులు నమోదు చేస్తూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అసోం, పశ్చిమ బెంగాల్, బిహార్ రాష్ట్రాల్లో నిరసనకారులను లక్ష్యంగా చేసుకుని కేసులు పెడుతున్నట్లు పలువురు విద్యార్థులు తమ దృష్టికి తీసుకొచ్చారని వెల్లడించారు. బాధితులకు న్యాయం అందించేందుకు ఈ కేసులకు సంబంధించి సీజేపీ లాయర్లు చట్టపరంగా సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు. గతంలో ఇచ్చిన మాటను గుర్తుచేస్తూ కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. "రేపటిలోగా దేశవ్యాప్తంగా నిరసనకారులపై పెట్టిన అన్ని కేసులనూ బేషరతుగా ఉపసంహరించుకోవాలి. లేకపోతే కేంద్ర వైఖరికి నిరసనగా మరోసారి దేశవ్యాప్త పోరాటం తప్పదు" అని సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు.

# విజయ్ ప్రభుత్వ ఉత్తర్వులు రద్దు



**తమిళనాడు :** తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టు కీలక షాక్ ఇచ్చింది. కరూర్ తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సోమవారం హైకోర్టు రద్దు చేసింది. గత ఏడాది సెప్టెంబర్ 27న టీవీకే అధినేత విజయ్ నిర్వహించిన భారీ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసు దర్యాప్తుపై సందేహాలు వ్యక్తమైన నేపథ్యంలో 2025 అక్టోబర్‌లో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం నుంచి కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ కి బదిలీ చేసింది. నిష్పాక్షిక, స్వతంత్ర విచారణ అవసరమని పేర్కొన్న సుప్రీంకోర్టు.. ర్యాలీలో భద్రతా ఏర్పాట్లు, జనసందోహ నియంత్రణ, విజయ్ రాక సమయం, పార్టీ నిర్వాహకులు–స్థానిక అధికారుల మధ్య సమన్వయం వంటి అంశాలపై సీబీఐ దర్యాప్తు కొనసాగిస్తోంది. అయితే ఇటీవల కరూర్ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి విజయ్.. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన బాధితుల 32 మంది వారసులకు కారుణ్య నియామకాల కింద ప్రభుత్వ ఉద్యోగాల నియామక ఉత్తర్వులను అందజేశారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేస్తూ కీలక తీర్పు వెలువరించింది. దీంతో విజయ్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లైంది.

# 10 స్టేషన్లతో కొత్త ప్లాన్.!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు మరింత మెరుగైన, సౌకర్యవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్లను అన్ని విధాలా తీర్చిదిద్దేందుకు వెంటనే ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఈ మేరకు బేగంపేట్ నుంచి రాయదుర్గ్ వరకు మెట్రోలో స్వయంగా ప్రయాణించి, పలు కీలక స్టేషన్లను, అక్కడి వీధి స్థాయి వసతులను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

**బేగంపేట్ నుండి రాయదుర్గ్ వరకు క్షేత్రస్థాయి పరిశీలన**

పర్యటనలో భాగంగా బేగంపేట్, అమీర్ పేట్, రాయదుర్గ్ మెట్రో స్టేషన్లలోని ప్లాట్‌ఫామ్‌లు, కాంకోర్స్ ప్రాంతాలను అజిత్ రెడ్డి సందర్శించారు. అక్కడ ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై మెట్రో ఇంజనీర్లు , ఆపరేషన్ల నిర్వాహక సంస్థ కియోలిస్ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాయదుర్గ్ వద్ద ఉన్న స్కైవాక్, ఐటీ కంపెనీలకు ఉన్న కనెక్టివిటీ మార్గాలు , మైండ్‌స్పేస్ జంక్షన్ వద్ద ప్రయాణికుల రాకపోకలను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మరింత పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని, అలాగే స్టేషన్ల కింద ఉన్న వాణిజ్య సముదాయాల నిర్వహణ సరిగ్గా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

**పార్కింగ్, పారిశుధ్య నిర్వహణపై సమీక్ష**

మెట్రో స్టేషన్ల కింద ఉన్న పార్కింగ్ స్థలాల వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, బేగంపేట్, అమీర్ పేట్, రాయదుర్గ్ పార్కింగ్ ఏరియాలను పరిశీలించి అభివృద్ధికి తగిన సూచనలు చేశారు. అలాగే, పిల్లర్ల మధ్య ఉన్న సెంట్రల్ మెరిడియన్ నిర్వహణ , పారిశుధ్య స్థితిగతులపై ఆయన సమీక్షించారు. ప్రయాణికులకు ఇచ్చే సేవలలో స్వచ్ఛత, పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్వహణ చూసే ఏజెన్సీల పనితీరును ఇంకా మెరుగుపరచాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ప్రాథమికంగా 10 స్టేషన్ల ఎంపిక , తదుపరి చర్యలు**

మెట్రో స్టేషన్లను మరింత మోడల్‌గా తీర్చిదిద్దేందుకు స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు



రూపొందించాలని అజిత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా మొదటి విడతలో 10 మెట్రో స్టేషన్లను ఎంపిక చేసి, వాటిని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన అన్ని మెట్రో స్టేషన్లను కూడా స్వయంగా సందర్శించి, ప్రయాణికులకు అందే సౌకర్యాలు, పార్కింగ్, పారిశుధ్యం , భద్రతను క్రమం తప్పకుండా సమీక్షిస్తానని తెలిపారు. నగరవాసులకు అత్యంత సురక్షితమైన , ప్రశాంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే తమ మొదటి ప్రాధాన్యత అని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# మా పెద్ది సుదర్శన్‌ను కాపాడండి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న పార్టీ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలుసుకున్నారు. సోమవారం స్వయంగా సికింద్రాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి వచ్చి పరామర్శించారు. అనంతరం కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అందుతున్న చికిత్స గురించి డాక్టర్లతో వాకబు చేశారు. దాదాపు అరగంట సేపు అక్కడే ఉండి డాక్టర్లతో మాట్లాడారు. కాగా, పెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రపంచ స్థాయి అత్యున్నత చికిత్సను అందిస్తున్నామని, అవసరమైన మేరకు విదేశాల నుంచి కూడా డాక్టర్లతో కన్సల్టెన్సీ తీసుకుంటున్నామని డాక్టర్లు తెలిపారు. గుండె ఊపిరితిత్తులు మిగతా అవయవాలు అన్ని పనిచేస్తున్నాయని కాకపోతే కొంత బ్రెయిన్ ఇంకా పునరుత్తేజం చెందాల్సి ఉన్నదని అందుకు మరో 48 గంటలు సమయం పట్టే అవకాశం ఉన్నదని డాక్టర్లు వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో పూర్తి స్థాయిలో, స్పష్టమైన నిర్దిష్ట సమాచారం ఇవ్వడానికి మరికొంత సమయం పడుతుందని తెలిపారు. కాగా.. ఖర్చుకు వెనకాడకుండా పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడుకోవడానికి పార్టీ శాయశక్తులా కృషి చేస్తుందని కేసీఆర్ స్పష్టం చేశారు. ఐసీయూలో వైద్య చికిత్స విధానాన్ని పరిశీలించిన అనంతరం, కుటుంబ సభ్యుల వద్దకు చేరుకున్న కేసీఆర్, వారికి భరోసాను, ధైర్యాన్ని అందించారు. డాక్టర్ల కృషితో, దేవుని దయతో, ప్రజల ఆశీర్వాదంతో ఆయన కోలుకుంటాడని కేసీఆర్ విశ్వాసాన్ని ప్రకటించారు. చివరగా "మీరేం చేస్తారో చేయండి.. కానీ మా పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడండి" అంటూ డాక్టర్లకు కేసీఆర్ చేతులెత్తి నమస్కరించారు.






ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# కేసీఆర్ మొండి వైఖరితోనే...

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా బొగ్గు గనులను పారదర్శకంగా వేలం పాట ద్వారా కేటాయించాలని ఆదేశించినప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నూతన బొగ్గు బ్లాకులు లభించక, ఆదాయ మార్గాలు మూసుకుపోయి సింగరేణి వెనుకబడిపోవడానికి కేసీఆర్ ద్రోహమే కారణమని ఆయన ఆరోపించారు. సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, గతంలో కేంద్రం ఇచ్చే రూ. 525 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు.

**నైని కోల్ బ్లాక్ పురోగతి , జెన్కో పోటీపై హెచ్చరిక**

2015లోనే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చొరవ తీసుకుని నైని కోల్ బ్లాక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులను ఇప్పించినట్లు వెల్లడించారు. అలాగే తాడిచర్ల-2 బ్లాక్‌ను కూడా కేంద్రం సింగరేణికి కేటాయించిందని, మణుగూరులోని ఒక బ్లాక్‌ను వేలంలో ఉంచామని తెలిపారు. అయితే ఈ వేలంలో సింగరేణికి పోటీగా తెలంగాణ జెన్కో పాల్గొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జెన్కో టెండర్ నుంచి తప్పుకుని, ఆ బ్లాకులు సింగరేణికి దక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సీఎంకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఈ మూడు కొత్త బ్లాకులు సింగరేణికి దక్కితే సుమారు 6,500 మందికి ఉద్యోగావకాశాలు రావడంతో పాటు, 830 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, దాదాపు రూ. 1.95 లక్షల కోట్ల టర్నోవర్‌తో సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**పేపర్ లీకేజీల నిరోధానికి కఠిన చట్టం..**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ పరీక్షల చట్టం గురించి మాట్లాడుతూ.. 2024లోనే ఎలాంటి డిమాండ్లు, నిరసనలు లేకపోయినా ముందస్తు జాగ్రత్తగా ఈ యాంటీ-పేపర్ లీక్ బిల్లును తీసుకొచ్చామని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా పేపర్ లీకేజీలకు పాల్పడాలంటే భయపడేలా, గుండెలాగిపోయే స్థాయిలో అత్యంత కఠినమైన నిబంధనలతో ఈ చట్టాన్ని రూపొందించామని చెప్పారు. విద్యా వ్యవస్థలో మార్పుల కోసం ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా స్వాగతిస్తుందని భావిస్తే, వారు చట్టాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. ఫలితాలు వచ్చిన వేళ నిరాశతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారిలో ధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చివరగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన దాడి ఘటన తీవ్ర బాధాకరమని, దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ జరుపుతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



## ప్రతి ఇంటికి 'కుటుంబ రిజిస్టర్' సర్టిఫికెట్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర ప్రజలకు పౌర సేవలను మరింత వేగవంతంగా, సులభంగా అందించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం మరొక కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజల కోసం త్వరలోనే 'కుటుంబ రిజిస్టర్' విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ నూతన విధానం ద్వారా ప్రతి కుటుంబానికి సంబంధించిన సమగ్ర వివరాలు అధికారిక రికార్డు రూపంలో భద్రంగా అందుబాటులో ఉంటాయి. పౌరులు వివిధ ప్రభుత్వ పథకాలు, ధ్రువీకరణ పత్రాలు పొందడానికి పదే పదే కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, సులభంగా సేవలు పొందేందుకు ఈ రిజిస్టర్ దోహదపడనుంది. అర్హులైన పౌరులకు మీ సేవ (మీసేవ) కేంద్రాల ద్వారా అధికారికంగా 'కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్' జారీ చేయబడుతుంది. ప్రజలు ఈ సర్టిఫికెట్ కోసం నేరుగా మీ సేవ కేంద్రాలను సందర్శించవచ్చు లేదా 'మీ సేవ ఆన్లైన్ పోర్టల్', మొబైల్ యాప్ ద్వారా కూడా సులభంగా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ప్రభుత్వ సేవల్లో పారదర్శకతను పెంచడంతో పాటు ప్రజలకు సమయం.. శ్రమ ఆదా అయ్యేలా ఈ 'కుటుంబ రిజిస్టర్' వ్యవస్థను త్వరలోనే పూర్తి స్థాయిలో అమల్లోకి తీసుకురానున్నట్లు అధికారులు వెల్లడించారు.

# సీఎం రేవంత్ 'నయా ఫార్ములా'!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో వివిధ కార్పొరేషన్లు, ఫెడరేషన్ల చైర్మన్ల పదవులపై భర్తీపై ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో 2024 జులైలో మొత్తం 37 మందికి ప్రభుత్వం కార్పొరేషన్ పదవులు ఇచ్చింది. వీరి రెండేళ్ల కాలపరిమితి పూర్తయింది. దీంతో ఖాళీ అయిన ఈ స్థానాలతో పాటు పెండింగ్‌లో ఉన్న మరో 50కి పైగా కార్పొరేషన్ చైర్మన్ల భర్తీకి టీపీసీసీ కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో పదవులు తిరిగి దక్కించుకునేందుకు, ఎలాగైనా తమ టర్మ్ ను మరో దఫా రెన్యూవల్ చేయించుకునేందుకు తాజా మాజీ చైర్మన్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం పార్టీ పెద్దలు, తమ గాడ్ ఫాదర్ల వద్దకు క్యూ కడుతుండగా మరికొందరు ఏకంగా ఏఐసీసీ స్థాయిలో లాబీయింగ్ చేయిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది.



**మాకూ ఓ చాన్స్ ఇవ్వండి ప్లీజ్..**

అయితే మొదటిసారి పదవులు ఇచ్చాక ఆయా సంస్థల్లో ఏం జరుగుతుందో అర్థం చేసుకుని పట్టు సాధించేందుకే ఇంత సమయం పట్టిందని ఇంతలోనే పదవీ కాలం ముగిసిపోవడంతో ఇక తమ మార్క్ ఎలా చూయించుకోగలమంటూ తాజా మాజీ చైర్మన్లు ఆవేదన వెల్లి బుచ్చుకుంటున్నారట. అందువల్ల మరోసారి తమకే అవకాశం కల్పిస్తే తమ సత్తా ఏంటో నిరూపించుకునేందుకు అవకాశం దక్కినట్లు అవుతుందని పార్టీ పెద్దల వద్ద తమ గోడును వినిపిస్తున్నారట. అయితే మళ్లీ పాతవారికే అవకాశం కల్పిస్తే తమ పరిస్థితి ఏంటి అనే ఒత్తిడి ఆశావహుల నుంచి పార్టీ పెద్దలపై పెరుగుతోందనే చర్చ వినిపిస్తోంది. కష్టనష్టాల్లో పార్టీకి వెన్నంటి ఉన్నామని, పార్టీనే నమ్ముకుని ఉన్న తమకు ఒక్క చాన్స్ ఇవ్వాలని లేదంటే పార్టీ కోసం పని చేసి ప్రయోజనం ఏంటనే ఆవేదన పదవులు ఆశిస్తున్న వారి నుంచి వ్యక్తం అవుతోందట. దీంతో తాజా మాజీలు, కొత్త ఆశావహుల మధ్య మింగమంటే కప్పకు కోపం వద్దంటే పాముకు కోపం అన్న చందంగా పార్టీ పెద్దల పరిస్థితి తయారైందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**సీఎం నయా ఫార్ములా:**

ఈ పరిస్థితికి చెక్ పెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నయా ఫార్ములా తెరపైకి తీసుకువచ్చినట్లు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ విడతలో పలువురికి తిరిగి రెన్యువల్ కాకపోయినా, సీనియర్ నాయకులకు పదవులు దక్కకపోయినా పార్టీలో అసమ్మతి, తిరుగుబాటు రాకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకత్వం ఒక కొత్త వ్యూహాన్ని సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. రాబోయే రోజుల్లో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) జరగడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతో నామినేటెడ్ పదవులు దక్కని సీనియర్ నాయకులకు వచ్చే అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించేలా హామీ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. నామినేటెడ్ పదవులు దక్కని సీనియర్లకు భవిష్యత్తులో అసెంబ్లీ లేదా లోక్‌సభ టికెట్ ఇస్తామని ముందస్తు హామీ ఇవ్వడం ద్వారా పార్టీలో అంతర్గత విభేదాలు, అసంతృప్తులు తలెత్తకుండా అడ్డుకోవచ్చని పార్టీ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

**అంగీకరించేదెంతమంది?:**

డిలిమిటేషన్ ప్రక్రియ ద్వారా రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య 119 నుండి 182కి పెరిగే అవకాశం ఉంది. అలాగే లోక్‌సభ స్థానాల సంఖ్య కూడా 17 నుండి 26కి పెరగనున్నట్లు చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో కళ్ళముందున్న నామినేటెడ్ పదవిని కాదని భవిష్యత్తులో ఇస్తామనే టికెట్ హామీకి ఎంత మంది అంగీకరిస్తారనేది ఉత్కంఠగా మారింది. ఎన్నికల నాటికి రాజకీయ పరిణామాలు, పరిస్థితులు ఎలా ఉంటాయో అని ఆందోళన చెందుతున్న నేతలు ఫ్యూచర్ సంగతి అప్పుడు చూద్దాం ఇప్పుడైతే ఈ చాన్స్ వదిలిపెట్టకూడదనే పట్టుదలతో ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఈ నామినేటెడ్ పదవులను త్వరలోనే భర్తీ చేసేందుకు పీసీసీ కసరత్తు చేస్తుండగా ఇందులో ఎవరికి పదవులు మోక్షం దక్కనుందో చూడాలి.



## హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు మద్దతుగా రేవంత్ సర్కార్..!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైడ్రా చీఫ్ ఎ.వి.రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ హైకోర్టు నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు మద్దతుగా నిలవాలని నిర్ణయించింది. ఈ అంశంలో లీగల్ ఒపీనియన్ తీసుకోవాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీంతో తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్‌ను న్యూఢిల్లీకి పంపించారు. అలాగే గతంలో కోర్టు ధిక్కారణ పిటిషన్లను అధికారులు పరిశీలిస్తున్నారు. హైకోర్టు తీర్పు కాపీ అందిన తర్వాత.. సింగిల్ బెంచ్ తీర్పుపై డివిజన్ బెంచ్‌కు వెళ్లాలని యోజనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. లోతుకుంట భూముల కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌పై సోమవారం తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని తెలంగాణ హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని అభిప్రాయపడింది. ఆయన్ని తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది.

# విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు

**మధిర,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటుగా పోషక విలువలతో కూడిన బలమైన ఆహారాన్ని అందించేందుకు సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక ప్రణాళిక విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం కేంద్రమైన మధిర విజయవాడ రోడ్ లో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డులో "హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్" ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మధిర మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన సభకు డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల పేద విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన, బలమైన ఆహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమాజంలోని బలహీన వర్గాలకు ఈ బ్రేక్ ఫాస్ట్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఉచిత పథకాలు అనేవి ఈ రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం పెట్టే పెట్టుబడి అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా ప్రకటించారు. మిడిమిడి జ్ఞానంతో తెలిసి తెలియక చాలామంది ఉచిత పథకాల పైన విమర్శ చేస్తున్నారని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పరిశ్రమలు ప్రాజెక్టులు ఇతర అనేక అంశాలపై ప్రభుత్వం పెట్టుబడి పెట్టినట్లుగానే పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు సహా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరి పైన ప్రభుత్వం పెట్టుబడి పెడుతుందని ఆయన అన్నారు. ఈ పెట్టుబడి ఫలితాలు ప్రజలు అభివృద్ధి చెంది ఆర్థికంగా, సామాజికంగా ముందుకు వెళ్లేందుకు దోహదం చేసేవిగా ఉంటాయని ఆయన అన్నారు. మధిర నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పోషకాహార అల్పాహారాన్ని అందించే సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పుట్టిన ఏ బిడ్డ కూడా ఆర్థాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన ఆశయమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పిల్లల శారీరక, మానసిక వికాసం కోసం ఉదయమే రుచికరమైన, శుచి-శుభ్రతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. బడ్జెట్‌లో ప్రకటించిన విధంగానే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత అల్పాహార పథకాన్ని మధిర నియోజకవర్గంలో ప్రారంభించినట్లు చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో ఏ బిడ్డ కూడా ఆర్థాకలితో పాఠశాలకు వెళ్లకూడదు.. ఇక్కడ పుట్టిన ప్రతి బిడ్డ.. రాష్ట్ర భవిష్యత్తు అని ఆయన చెప్పారు వారి భవిష్యత్తే మన భవిష్యత్తు. అటువంటి బిడ్డల భవిష్యత్తు కోసం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంతృప్తికరంగా ఉదయం పూట బ్రేక్ ఫాస్ట్ చేసి చదువుకోవాలని అన్నారు. రుచికరమైన, శుచి శుభ్రతతో కూడిన న్యూట్రీషియస్ ఫుడ్ ని మనం అందించాలని చెప్పి ఈ క్యాబినెట్ చేసిన నిర్ణయం మేరకు బడ్జెట్ లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని ఆయన చెప్పారు. మానవ వనరులు మన రాష్ట్ర సంపద. ఏ రాష్ట్ర అభివృద్ధికైనా సహజ వనరులు ఎంత అవసరమో.. సమర్థవంతమైన మానవ వనరులు కూడా అంతే అవసరమని భట్టి విక్రమార్క నొక్కి వక్కాణించారు. అత్యంత ప్రతిభావంతులు తయారైనటువంటి మానవ వనరులు ఉన్నటువంటి రాష్ట్రం గాని, దేశం గాని ప్రపంచంలో అత్యంత శక్తివంతంగా మారుతుందని ఆయన అన్నారు. రాష్ట్రానికే కాదు దేశానికి, ప్రపంచానికి కూడా దశా దిశా నిర్దేశం చేయగలిగినటువంటి మానవ వనరులను సానబెట్టిన వజ్రాల్లాగా ప్రపంచం మీదికి మనం వదిలి పెట్టగలగాలి. అటువంటి వజ్రాల్ని తయారు చేసుకోవాల్సిన తరుణంలో మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా మొదలుపెట్టే కార్యక్రమానికి నాంది పలికామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 లక్షల మంది విద్యార్థులకి ఒకటే సమయానికి వేడిగా అల్పాహారం అందించడం అంటే ఇది ఒక చారిత్రాత్మకమైన నిర్ణయం. ఈ దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లెక్కించాల్సిన అంశమని అన్నారు. సాధారణంగా ఒక కుటుంబంలో ఇద్దరు పిల్లలకు సమయానికి టిఫిన్ కట్టడమే తల్లిదండ్రులకు కష్టంగా మారిన రోజులివి. అలాంటిది ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 20 లక్షల మంది, రెసిడెన్షియల్ స్కూళ్లలోని 7 లక్షల మంది పిల్లలతో కలిపి మొత్తం 27 లక్షల మందికి ఒకే సమయానికి వేడివేడిగా అల్పాహారం అందించడం దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన అంశమని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ, ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద ఎత్తున అల్పాహారం అందించే వ్యవస్థ లేదని భట్టి పేర్కొన్నారు. సంకల్పం మంచిదైతే భగవంతుని ఆశీస్సులు ఉంటాయని, అందుకే సాధ్యం కాదనుకున్న ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రభుత్వం సాధ్యం చేసి చూపిందని డిప్యూటీ సీఎం హర్షం వ్యక్తం చేశారు. హరే కృష్ణ మిషన్ భాగస్వామ్యంతో పకడ్బందీగా, అత్యంత శుభ్రమైన వాతావరణంలో మెకనైజ్డ్ కిచెన్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం మధిరలోని తాత్కాలిక సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా 16 మండలాల స్కూళ్లకు వాహనాల్లో అల్పాహారం అందిస్తున్నామని అన్నారు. రాబోయే 3 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా శాశ్వత కిచెన్ నిర్మాణాలను పూర్తి చేసి విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారాన్ని అందించనున్నట్లు భట్టి విక్రమార్క చెప్పారు. పిల్లలకు అందించే అల్పాహారంతో పాటు పౌష్టికాహారం కోసం వారానికి 3 రోజుల పాలు, మరో 3 రోజులు రాగి జావను ప్రత్యేకంగా అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ఇల్లు లేని వారి కోసం రూ. 5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. గృహ ప్రవేశానికి మనం వెళ్ళినప్పుడు ఆ పేదవాళ్ల కళ్లల్లో ఆనందం చూస్తే.. ఇది కదా పాలన అనే అనుభూతి కలుగుతోంది. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు చేసిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలను కళ్లారా చూశానని భట్టి విక్రమార్క చెప్పారు. ఈ సమయంలో బడుల దుస్థితి, నిరుద్యోగుల ఆవేదన, ఇల్లు లేని పేదల బాధలను విన్నానని చెప్పారు. ఆనాడే నా మనసులో రూపుదిద్దుకున్న ఆలోచనలే నేడు ఒక్కొక్కటిగా పథకాలుగా మారుతున్నాయని భావోద్వేగానికి లోనవుతూ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ₹22,500 కోట్లతో మొదటి విడతలోనే 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేశాం. మహాలక్ష్మి పథకంతో సగం జనాభా ఉన్న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నాం. మహిళలను కోటీశ్వరులను చేసేందుకు బ్యాంక్ లింకేజీ ద్వారా ఇప్పటికే ₹67,000 కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చాం. పేద కుటుంబ వైద్య పరిమితిని ఏకంగా ₹10 లక్షలకు పెంచాం. కోటి 6 లక్షల కుటుంబాలకు నెలకు మనిషికి 6 కేజీల చొప్పున సన్న బియ్యాన్ని అందిస్తున్నాం. కేవలం 9 రోజుల్లోనే ₹9,000 కోట్ల నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ ఖమ్మం వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి మధిర మున్సిపాలిటీ చైర్పర్సన్ సామినేని సుజాత మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు కమిషనర్ సామ్యూల్ పాల్ ఎంఈఓ మురలీధర్ రావు ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలి..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి రంగనాథ్‌ను తప్పించాలంటూ తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. హైడ్రా కమిషనర్‌ను తొలగించాలని హైకోర్టు ఆదేశించడం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణిని తేటతెల్లం చేసిందన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేసిన కవిత.. అక్రమ కట్టడాల పేరుతో పేదల నివాసాలను ఇష్టారాజ్యంగా కూల్చివేసిన ప్రభుత్వానికి ఇది చెంపపెట్టు అన్నారు. న్యాయస్థానం ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘిస్తున్న హైడ్రాపై మిలిటరీ యాక్షన్‌కు ఆదేశిస్తామని హైకోర్టు హెచ్చరించినా హైడ్రా తీరు మారలేదని ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని పెద్ద వాళ్లకు ఒక న్యాయం, పేద వాళ్లకు ఒక న్యాయం అనే విధంగా కాకుండా పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఓ ప్రైవేట్ భూమి విషయంలో హైకోర్టు ఆదేశాలు ఉన్నా రంగనాథ్ వాటిని ఉల్లంఘించారని అలాగే ఆయనపై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని అన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేస్తూ అతడిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

**కవిత వర్సెస్ రంగనాథ్:**

కాగా ఇటీవల హైడ్రాకు కవితకు మధ్య బిగ్ ఫైట్ నడిచింది. రేవంత్ రెడ్డి వచ్చాక హైడ్రా అనే మహమ్మారిని తీసుకువచ్చారని కవిత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇటీవల తాము గండిపేట మండలం నార్సింగ్‌లో ఓ ప్రైవేట్ సంస్థ మూసీ నది మధ్యలో నిర్మాణాలు చేపడుతుంటే ఆందోళన చేస్తే హైడ్రా మమ్మల్నే బద్నాం చేయాలని చూస్తోందని కమిషనర్ రంగనాథ్ తీరుపై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాదంలో మిస్టర్ రంగనాథ్ మిమ్మల్ని వేము కోర్టుకు ఈడిస్తామంటూ గతంలో హెచ్చరించారు. అయితే తాజాగా హైకోర్టు రంగనాథ్ ను తొలగించాలని ఆదేశించిన నేపథ్యంలోపై స్పందించారు.

## సంపాదకీయం

# సరికొత్త బెంచ్ మార్క్...




ప్రపంచవ్యాప్తంగా అస్తవ్యస్త పరిస్థితులు రాజ్యం చేస్తున్నాయి. మన దేశం విషయానికొస్తే ఆర్థిక సంక్షోభం, ఉద్యోగాల కోతకు తోడు పరీక్షపత్రాల లీకేజీలతో యువతలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. సాధారణంగా ఏదీ పట్టనట్టుగా ఉండే జెన్‌జీ.. ఇప్పుడు ఆలోచించడమే కాదు.. కదం తొక్కడమూ మొదలుపెట్టిందని.. ఢిల్లీలో ఉద్యమం తేటతెల్లం చేసింది. కాకపోతే యువత ఇంతటితో ఆగే పరిస్థితి లేదు. రేపటి రాజకీయాన్ని కొత్తగా నిర్వచించాలనే ఆకాంక్షతో కదులుతున్నాయి. సంప్రదాయ రాజకీయ విధానాల్ని బద్దలుకొడుతూ.. సరికొత్త బెంచ్‌మార్క్ సెట్ చేసే దిశగా కదిలే అవకాశం కనిపిస్తోంది. ప్రపంచంలో అనిశ్చితి రాజ్యమేలుతోంది. యుద్ధం మెజార్టీ దేశాలకు ఆర్థిక సంక్షోభం తెచ్చిపెట్టింది. మన దేశంలో యుద్ధానికి తోడు ఎల్‌నినోతో తీవ్ర నిరాశ అలముకుంది. వీటితో పాటు ఉద్యోగాల కోతలు, రూపాయి పతనం, ధరల పెరుగుదలతో సామాన్యుడు కుదేలౌతున్నాడు. ఇది చాలదన్నట్టుగా వరుసగా లీకౌతున్న ప్రశ్నాపత్రాలతో విద్యార్థి లోకం కూడా జూలు విదిల్చే పరిస్థితి వచ్చేసింది.వరుస యుద్ధాలతో ప్రపంచ దేశాలు ఒడ్డున పడ్డ చేపల్లా గిలగిలా కొట్టుకుంటున్నాయి. ఈ సంక్షోభాలను సమృద్ధిగా ఉన్న ఆహారధాన్యాలు గల దేశాలు గుడ్డిలో మెల్లగా ఎదుర్కున్నాయి. కానీ ఇప్పుడు ఆ దేశాలకు కూడా తెరిపిన పడే అవకాశం ఇవ్వకుండా ఎల్‌నినో వచ్చేసింది. మన దేశంలో ఇప్పటికే ఆర్థిక సంక్షోభం కారణంగా ఎడాపెడా ఉద్యోగాల కోతలు అమలౌతున్నాయి. ప్రజల ఆదాయాలు బాగా తగ్గిపోయాయి. నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయింది. రూపాయి పతనం కొనసాగుతూనే ఉంది. మరోవైపు పెట్రోల్ ధరలు ఆకాశమే హద్దుగా పెరుగుతున్నాయి. దీంతో ధరలు పెరిగిపోయి ద్రవ్యోల్బణానికి రెక్కలొచ్చాయి. స్టాక్ మార్కెట్లు నేలచూపులు చూస్తున్నాయి. ఇలా ఒక్క మన దేశమే కాదు.. ప్రపంచంలో ఏ దేశం పరిస్థితి చూసినా.. అంతటా అస్తవ్యస్త పరిస్థితులే రాజ్యం చేస్తున్నాయి.ఇరాన్ యుద్ధ ప్రభావం కేవలం అమెరికా, ఇరాన్‌లకే పరిమితం కాలేదు. ప్రపంచబ్యాంక్ ఈ ఏడాది అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి రేటు అంచనాను కోవిడ్ కాలం తర్వాత అత్యంత కనిష్టంగా 2.5 శాతానికి తగ్గించింది. మధ్యప్రాచ్య దేశాల జీడీపీ వృద్ధి రేటు 4.5 శాతం నుండి 1.3 శాతానికి పడిపోయింది. వ్యవసాయానికి కీలకమైన ఎరువుల ధరలు ఏకంగా 47 శాతం పెరిగాయి. భారతదేశంలో కూడా దీని ప్రభావం స్పష్టంగా కనిపించింది. కమర్షియల్ ఎల్‌పీజీ ధరలు విపరీతంగా పెరగడంతో పాటు వంటగ్యాస్ కొరత ఏర్పడి సామాన్యులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు అంతకు మించిన సమస్యలు వచ్చే సంకేతాలు కాదు.. ఏకంగా క్లారిటీ కనిపిస్తోంది.యుద్ధం కారణంగా ప్రపంచం ఎదుర్కుంటున్న మరో పెద్ద సమస్య ద్రవ్యోల్బణం. ఇప్పటికే పలు దేశాల్లో రికార్డు స్థాయి ద్రవ్యోల్బణం నమోదవుతోంది. దీంతో వివిధ దేశాల కరెన్సీలు నేలచూపులు చూస్తున్నాయి. ఒక్కో దేశంలో ఒక్కో రకమైన సమస్య ఉంది. ఒక్కో రకమైన పరిస్థితులున్నాయి. అయితే ఇవన్నీ ప్రస్తుత అంచనాలు మాత్రమే. ఇక ముందు జరగబోయే యుద్ధం, దాని తీవ్ర పర్యవసానాలు ఎలా ఉంటాయో ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఇప్పటికే చాలా దేశాలు చేతులెత్తేశాయి. మిగతా దేశాల్లోనూ ప్రభుత్వాలు జాగ్రత్తగా ఉండాలని ప్రజల్ని హెచ్చరించి.. చేతులు దులుపుకుంటున్నాయి. అంటో రాబోయేది గడ్డు రోజులేననే విషయం ఇప్పటికే తేటతెల్లమైంది. ఇప్పటికే అన్ని రంగాలూ పడకేసి.. ప్రజలకు తీవ్ర నిరాశానిస్పృహలు ముంచుకొచ్చేశాయి.ఇరాన్ యుద్ధం ఆగే ప్రసక్తే లేదని తేలిపోవడంతో.. నిరాశలో మునిగిన ప్రపంచానికి.. ఎల్‌నినో ప్రభావం ఏమాత్రం మింగుడుపడటం లేదు. ఇప్పటికే మన దేశంలో ఎల్‌నినో ప్రభావంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గతంలో ఎన్నో సంక్షోభాల నుంచి దేశాన్ని బయటపడేసిన వ్యవసాయ రంగమే.. ఇప్పుడు ఎల్‌నినోతో సంక్షోభంలోకి వెళ్లే దుస్థితి నెలకొనడంతో.. భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇప్పటికే యుద్ధం కారణంగా ఇంధన, సరఫరా సమస్యలు వచ్చి.. ధరలు పెరిగి.. ద్రవ్యోల్బణం పెరిగింది. దీంతో ఆర్థిక సంక్షోభం వచ్చేసింది. కాకపోతే ఆర్థిక సమస్యలు వచ్చినా.. వ్యవసాయం బాగుంటే ఏదోలా నెట్టుకురావచ్చనుకున్న సామాన్యుడి ఆశలపై ఎల్‌నినో నీళ్లు చల్లింది. ఇప్పుడు ఎల్‌నినో కారణంగా వర్షాభావంతో.. సాగువిస్తీర్ణం భారీగా తగ్గింది. కరోనా సమయం నుంచీ ఊహించని పంటల దిగుబడులతో.. ఇతర దేశాలను ఉదారంగా ఆదుకున్నాక కూడా.. మనకు తిండిగింజలకు కొరత రాలేదు. కానీ ఇప్పుడు ఎల్‌నినో ఆ పరిస్థితిని రివర్స్ చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. వ్యవసాయం కుదేలై.. పంటల దిగుబడులు తగ్గితే.. ఆహార సమస్య వచ్చి.. అది ఆహార ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. అప్పుడు అటు ఆర్థికంగా చితికిపోయి.. ఇటు ఆహారం కూడా దొరకని పరిస్థితుల్లో.. సామాన్యులు మరింతగా విలవిల్లాడటం ఖాయమనే అంచనాలు అందర్నీ భయపెడుతున్నాయి. సరే ఎక్కడ ఏ సంక్షోభం వచ్చినా సామాన్యుడే సమిధగా మారుతున్న వాస్తవం కూడా అందరికీ తెలిసిందే. మధ్యతరగతి నడ్డివిరిగే పరిస్థితులు ఒకదానితర్వాత ఒకటిగా చాలా వేగంగా ఏర్పడుతుండటం.. దీర్ఘకాలిక సంక్షోభాలకు దారితీసే ప్రమాదం లేకపోలేదు.మొత్తం మీద వరుస సంక్షోభాలు, గడ్డు పరిస్థితులు సామాన్యుల జీవనాన్ని దుర్భరం చేస్తున్నాయి. దీనికి తోడు ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రభుత్వాలు.. ప్రజల అంచనాల్ని అందుకోవడంలో ఘోరంగా విఫలమౌతున్నాయి. దీంతో తమ పనేదో తమది అన్నట్టుగా ఉండే యువతలో కూడా కదలిక వచ్చింది. ఎటుచూసినా సమస్యల వలయమే కనిపిస్తుందనే భావనతో ఉన్న విద్యార్థులకు.. వరుసగా జరుగుతున్న పరీక్షా పత్రాల లీకేజీ ఘటనలు.. ఆగ్రహం తెప్పించాయి. అనుకోకుండా వచ్చే ప్రతికూల పరిస్థితుల్ని పక్కనపెడితే.. తమ నిర్వాకంతో ప్రభుత్వాలు చేజేతులా తెచ్చిపెడుతున్న విద్యా సంక్షోభాల్ని మాత్రం ఉపేక్షించే పరిస్థితి లేదని జెన్‌జీ ఓ దృఢ నిశ్చయానికి వచ్చేసింది. అలాగే సంప్రదాయ నిరసనలతో పని కాదని కూడా డిసైడైపోయింది. ఎవరేమనుకున్నా.. తమ పద్ధతిలో ఆందోళనలు చేస్తేనే.. ప్రభుత్వాలకు గట్టిగా ఝలక్ ఇస్తేనే.. పరిస్థితులు మారతాయని గట్టిగా నమ్ముతోంది. ఆ ఉద్దేశంతోనే పలు దేశాల్లో జెన్‌జీ ఉద్యమాలు నడిచాయి. నడుస్తున్నాయి.అదివరకే నెలకొన్న రాజకీయ వ్యవస్థలను సవాలు చేసేంత బలంగా జెన్ జీ ఉద్యమాలు ఎదగడానికి కొన్ని పరిస్థితులు అనుకూలిస్తాయి. మొదటిది, ఒకే పార్టీలు అధికారాన్ని శాసిస్తూ ఉండటం వల్ల ఎన్నికలు అర్థరహితంగా అనిపించేలా రాజకీయాలు ఉండాలి. రెండవది, రాజకీయ ప్రముఖులపై బహిరంగ అవినీతి, పెరుగుతున్న ప్రజాగ్రహం తరచుగా కనిపిస్తుంది. మూడవది, ఆర్థిక మందగమనం, నిరుద్యోగం తమ భవిష్యత్తు అనిశ్చితంగా ఉందని భావించే యువతలో నిరాశను కలిగిస్తాయి. నాల్గవది, రాజకీయ పార్టీలు తరచుగా వంశపారంపర్యంగా అవకాశాలు , అనుచరులు, కొందరి నియంత్రణలో ఉండి, కొత్తవారికి తక్కువ అవకాశాన్ని కల్పిస్తాయి. ఛాన్స్ రాకపోతే యువతలో సాధారణంగా నిరాశ నెలకొంటుంది.మన దేశంలో కూడా ఇటువంటి కొన్ని పరిస్థితులు ఉన్నాయి. దేశంలో 25 ఏళ్ల లోపు వయసున్న వారు 600 మిలియన్ల కంటే ఎక్కువ మంది ఉన్నారు. చాలా మంది యువత నిరుద్యోగం, విద్యాపరమైన ఒత్తిడి, ద్రవ్యోల్బణం, సామాజిక పురోగతికి సంబంధించిన ఆందోళనలను ఎదుర్కొంటున్నారు. యువ ఓటర్లు తమ కుటుంబాల నుండి రాజకీయ విశ్వసనీయతను పొందే అవకాశం కూడా తక్కువగా ఉంది. వారు మరింత వ్యక్తిగత స్వేచ్ఛను కోరుకుంటారు. పార్టీ కల్చర్ కంటే సమస్యలు, పనితీరు ఆధారంగా నాయకులకు మద్దతు ఇస్తారు. ఏతావాతా జెన్‌జీ ఆలోచనల్ని అందుకోవడం.. సంప్రదాయ పార్టీలు, నేతలకు నేల విడిచి సాము చేస్తున్నంత కష్టంగా ఉందని చెప్పటానికి సంకోచించాల్సిన పని లేదు.

# ఎల్ నినో ఎఫెక్ట్...!

## వర్షాభావం రైతునే కాదు.. మత్స్యకారుడినీ కుదేలు చేస్తోంది




ప్రకృతి అనుకూలిస్తేనే వ్యవసాయం, మత్స్య సంపద, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సజావుగా సాగుతాయి. వర్షాలు సకాలంలో కురిస్తే రైతు పంట పండుతుంది. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండితే మత్స్యకారుల వలలు చేపలతో నిండుతాయి. కానీ ప్రకృతి ప్రతికూలంగా మారితే దాని ప్రభావం కేవలం ఒక రంగంపైనే కాకుండా గ్రామీణ జీవన వ్యవస్థ మొత్తంపైనే పడుతుంది. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు ఇదే వాస్తవాన్ని మరోసారి గుర్తు చేస్తున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వ్యవసాయంతో పాటు మత్స్యరంగం కూడా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. చెరువులు ఎండిపోతుండటం, నీటి నిల్వలు తగ్గిపోవడం, చేప పిల్లల పంపిణీపై అనిశ్చితి నెలకొనడం వల్ల వేలాది మత్స్యకార కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.ప్రతి ఏడాది వర్షాకాలం ప్రారంభమైన వెంటనే చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుంటాయి. జూన్, జూలై నెలల్లో ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, ఆగస్టు నెలలో ఉచిత చేప పిల్లలను చెరువుల్లో వదిలే కార్యక్రమాన్ని చేపడుతుంది. ఈ పథకం ద్వారా మత్స్యకార సహకార సంఘాలకు చెందిన వేలాది కుటుంబాలు ప్రత్యక్షంగా లబ్ధి పొందుతాయి. ప్రభుత్వం చేప పిల్లలను ఉచితంగా అందించడంతో మత్స్యకారులకు పెట్టుబడి భారం తగ్గుతుంది. ఆరు నుంచి ఎనిమిది నెలల్లో చేపలు మార్కెట్‌కు అనువైన పరిమాణానికి ఎదిగి విక్రయాలకు సిద్ధమవుతాయి. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో మత్స్య ఉత్పత్తి పెరగడమే కాకుండా వేలాది కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది.ఈ ఏడాది మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. జూలై ముగింపు దశకు చేరుకున్నా జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు తగిన స్థాయిలో నీటిని సేకరించలేకపోయాయి. అనేక చెరువులు ఇప్పటికీ వెలవెలబోతున్నాయి. కొన్ని పూర్తిగా ఎండిపోయాయి. నీటి నిల్వలు లేకుండా చేప పిల్లలను వదిలితే అవి మనుగడ సాగించలేవన్నది అందరికీ తెలిసిన విషయమే. అందుకే సంబంధిత శాఖ అధికారులు ఇప్పటివరకు టెండర్ల ప్రక్రియను ప్రారంభించలేదు. ఎన్ని చెరువుల్లో చేప పిల్లలను వదలాలి, ఎంత పరిమాణంలో పంపిణీ చేయాలి, పరిస్థితులు ఎప్పుడు అనుకూలిస్తాయన్న అంశాలపై స్పష్టత లేకపోవడంతో మొత్తం కార్యక్రమం సందిగ్ధంలో పడింది.ఈ అనిశ్చితి మత్స్యకార కుటుంబాల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. గంగపుత్రులు, ముదిరాజులు వంటి సంప్రదాయ మత్స్యకార వర్గాల జీవనాధారం పూర్తిగా చెరువులపైనే ఆధారపడి ఉంటుంది. సంవత్సరంలో ఎక్కువ కాలం చేపల వేట, చేపల పెంపకం ద్వారానే కుటుంబాలను పోషించుకుంటారు. చేప పిల్లల పంపిణీ ఆలస్యం అయితే చేపల పెరుగుదల కూడా ఆలస్యమవుతుంది. ఫలితంగా ఆదాయం తగ్గిపోతుంది. ఒక సీజన్ కోల్పోతే దాని ప్రభావం ఏడాది పొడవునా ఉంటుంది. ఇప్పటికే పెరుగుతున్న జీవన వ్యయం, ఉపాధి కొరత, అప్పుల భారం మధ్య మత్స్యకార కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.చేప పిల్లలను సరైన సమయంలో చెరువుల్లో వదలడం అత్యంత కీలకం. సాధారణంగా జూలై లేదా ఆగస్టులో చేప పిల్లలను వదిలితే అవి ఆరు నెలల్లో దాదాపు కిలో వరకు బరువు పెరిగి విక్రయాలకు సిద్ధమవుతాయి. అదే సెప్టెంబర్ లేదా అక్టోబర్ వరకు ఆలస్యమైతే నీటి పరిస్థితులు, ఉష్ణోగ్రతల మార్పులు, పెరుగుదల కాలం తగ్గిపోవడం వంటి కారణాల వల్ల ఆశించిన ఉత్పత్తి సాధ్యం కాదు. దీనివల్ల మత్స్యకారులకు వచ్చే ఆదాయం గణనీయంగా తగ్గిపోతుంది. ప్రభుత్వం పెట్టే పెట్టుబడి కూడా ఆశించిన ఫలితాలను ఇవ్వదు.ఈ సంక్షోభం మత్స్యకారులకే పరిమితం కాదు. వర్షాభావం వల్ల రైతులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువుల కింద సాగు చేసే భూములకు నీరు అందక పంటలు వేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. తాగునీటి సమస్య కూడా క్రమంగా తీవ్రమవుతోంది. భూగర్భ జలమట్టాలు పడిపోవడంతో బోర్లు ఎండిపోతున్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం, మత్స్యరంగం, పశుసంవర్ధక రంగం పరస్పరం అనుసంధానమై ఉంటాయి. ఒక రంగం దెబ్బతింటే మిగతా రంగాలపై కూడా ప్రభావం పడటం సహజం. ప్రస్తుతం అదే పరిస్థితి కనిపిస్తోంది.ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో మత్స్యకారులు ప్రత్యామ్నాయ ఉపాధి కోసం అన్వేషిస్తున్నారు. కొందరు వ్యవసాయ కూలీలుగా పనిచేయాలని చూస్తుంటే, మరికొందరు పట్టణాలకు వలస వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. రోజూ వల విసిరితేనే పొట్ట నిండే కుటుంబాలు ఇప్పుడు ఉపాధి కోసం ఇతర పనుల వైపు మొగ్గు చూపడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఇటీవల కాటారం మండలంలో ఓ మత్స్యకారుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఈ వర్గాల్లో నెలకొన్న ఆర్థిక, మానసిక ఒత్తిడికి నిదర్శనంగా నిలిచింది. ఇటువంటి సంఘటనలు పెరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత.ప్రస్తుతం సంబంధిత శాఖ అధికారులు కూడా క్లిష్ట పరిస్థితినే ఎదుర్కొంటున్నారు. సాధారణంగా ఈ సమయానికి టెండర్ల ప్రక్రియ పూర్తయి ఉండాలి. కానీ వర్షాభావం కారణంగా నీటి లభ్యతపై స్పష్టత లేకపోవడంతో అధికారులు నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. చెరువుల పరిస్థితిని అంచనా వేసి అవసరమైన చేప పిల్లల సంఖ్యను సిద్ధంగా ఉంచినప్పటికీ, ప్రభుత్వ అనుమతులు లేక ముందడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. ఒకవైపు ప్రకృతి ప్రతికూలత, మరోవైపు పరిపాలనా అనిశ్చితి కలిసి మత్స్యరంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టుతున్నాయి.ప్రభుత్వం ఈ పరిస్థితిని కేవలం ప్రకృతి వైపరీత్యంగా చూసి చేతులు ముడుచుకోవడం సరైంది కాదు. వర్షాలు కురిసే వరకు ఎదురుచూడటమే పరిష్కారం కాదు. మత్స్యకార కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం, ఉపాధి హామీ, జీవన భృతి వంటి ఉపశమన చర్యలను అమలు చేయాలి. అవసరమైతే మత్స్యకారులకు ప్రత్యేక ఉపాధి కార్యక్రమాలు కల్పించాలి. చెరువుల పూడికతీత, కాలువల మరమ్మతులు, నీటి సంరక్షణ పనుల్లో వారికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా తాత్కాలిక ఉపాధిని కల్పించవచ్చు. సహకార సంఘాల ద్వారా తక్కువ వడ్డీ రుణాలు అందించి ఆర్థిక ఇబ్బందులను తగ్గించే చర్యలు తీసుకోవాలి.అంతేకాదు, వర్షాలపై మాత్రమే ఆధారపడే పరిస్థితిని తగ్గించే దిశగా ప్రభుత్వం దీర్ఘకాలిక కార్యాచరణ రూపొందించాలి. చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, చిన్న నీటి వనరుల అభివృద్ధి, ప్రాజెక్టుల నుంచి అవసరమైన చోట నీటి మళ్లింపు వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వాతావరణ మార్పుల ప్రభావం భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉన్నందున మత్స్యరంగానికి ప్రత్యేక వాతావరణ అనుకూల విధానాలు రూపొందించడం అవసరం. ఎల్‌నినో, లానినా వంటి వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, వాటికి అనుగుణంగా కార్యాచరణ రూపొందించే వ్యవస్థను బలోపేతం చేయాలి.ప్రభుత్వంతో పాటు మత్స్యకార సహకార సంఘాలు కూడా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ వ్యూహాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. చేపల పెంపకంలో ప్రత్యామ్నాయ సాంకేతిక పద్ధతులు, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే విధానాలు, చిన్న నీటి వనరుల్లో చేపల ఉత్పత్తి పెంపు వంటి అంశాలపై అవగాహన పెంచాలి. వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని మత్స్యరంగంలో ఆధునిక విధానాలను ప్రోత్సహించాల్సిన సమయం ఆసన్నమైంది.ఎల్‌నినో ప్రభావం ఈ ఏడాది రైతులనే కాదు, మత్స్యకారులనూ తీవ్రంగా దెబ్బతీస్తోంది. చెరువులు ఎండిపోవడం అంటే కేవలం నీరు లేకపోవడం మాత్రమే కాదు; వేలాది కుటుంబాల ఆశలు ఎండిపోవడమే. చేప పిల్లల పంపిణీ ఆలస్యం అంటే కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమం వాయిదా పడటం కాదు; గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన జీవనాధారం దెబ్బతినడం. అందుకే ప్రభుత్వం ఈ సమస్యను అత్యవసర అంశంగా పరిగణించి వేగంగా నిర్ణయాలు తీసుకోవాలి. వర్షాలు కురవాలని ప్రకృతిని కోరుకోవడం తప్పనిసరి. కానీ ప్రజల జీవనోపాధిని కాపాడే చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత. ప్రకృతి పరీక్షిస్తున్న ఈ సమయంలో పాలన కూడా తన సామర్థ్యాన్ని నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది. రైతు, మత్స్యకారుడు ఇద్దరూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు రెండు కళ్లలాంటి వారు. వారిలో ఎవరి జీవనాధారం దెబ్బతిన్నా గ్రామీణాభివృద్ధి అసంపూర్ణంగానే మిగిలిపోతుంది. అందుకే ఎల్‌నినో సవాలును ఎదుర్కొనే సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగితేనే మత్స్యరంగానికి మళ్లీ జలకళ వస్తుంది, మత్స్యకారుల జీవితాల్లో ఆశలు చిగురిస్తాయి.



# ఆ పార్టీ బిల్లు చెల్లించిందెవరు?..





**ఢిల్లీ:** కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాత కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు, కార్యకర్తల సంబరాలు అంబరాన్ని అంటాయి. సోషల్ మీడియా మొత్తం వారి వీడియోలతోనే నిండిపోయింది. కేంద్ర మంత్రి రాజీనామా అనంతరం సీజేపీ అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకాతో పాటు కార్యకర్తలు కూడా పెద్దఎత్తున పార్టీ చేసుకున్నారు. ఓ హోటల్‌లో వారంతా సంబరాలు చేసుకున్న వీడియోలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. బాలీవుడ్ పాటలకు సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకా డ్యాన్సులు చేస్తున్న వీడియోలు వైరల్‌గా మారాయి.సీజేపీ నేతల పార్టీపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మహేశ్ జెత్మలానీ స్పందించారు. సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టి పలు విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకా వేడుకల తీరును న్యాయవాది మహేశ్ జెత్మలానీ విమర్శించారు. హోటల్‌లో పార్టీ చేసుకోవడానికి నిధులు ఎక్కడి నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. 'నిజంగానా?.. సీజేపీ నాయకత్వం హోటల్‌లో విజయోత్సవం జరుపుకుంటోందా..!, ఢిల్లీలో రోజుల తరబడి హింసాకాండ జరిగిన తర్వాత ఈ యువ కార్యకర్తలమని చెప్పుకునే వారు డ్యాన్సులు చేస్తున్నారు' అని ఆయన మండిపడ్డారు.అలాగే ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఆందోళనల వెనుక ఉన్న ఆర్థిక వనరులపైనా జెత్మలానీ ప్రశ్నలు లేవనెత్తారు. ఢిల్లీ ఆందోళనల సమయంలో సీజేపీ నేతలు, కార్యకర్తల ప్రయాణం, ఆహారం, వసతి, లాజిస్టిక్స్ వంటి వాటికి నిధులు ఎక్కడ నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీని అట్టుడికించిన వారికి ఆర్థిక సహాయం ఎవరు చేశారంటూ ప్రశ్నలు సంధించారు. కాగా, నీట్ పేపర్ లీక్ ఘటనకు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన కొద్దిసేపటికే ఈ పార్టీ జరిగినట్లు తెలుస్తోంది.




# కారుతో నేరుగా పోలీసుల పైకే

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** డ్రగ్స్ కేసును ఛేదించేందుకు వెళ్లిన పోలీసులపై ఓ యువకుడు కారుతో దాడికి పాల్పడిన ఘటన హైదరాబాద్‌లో కలకలం రేపింది. డ్రగ్స్ కొనుగోలు జరుగుతోందన్న సమాచారంతో నిఘా పెట్టిన హెచ్-న్యూ పోలీసులపై నిందితుడు కారును దూ-సుకెళ్లడంతో ఓ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో మరో కానిస్టేబుల్, ఓ సీఐ కూడా గాయపడగా.. నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.పోలీసుల వివరాల ప్రకారం.. హెచ్-న్యూ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్‌కు అబిడ్స్‌లో డ్రగ్స్ కొనుగోలు జరుగుతోందన్న సమాచారం అందింది. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చిన ఆయన.. హెచ్-న్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌తో పాటు ప్రత్యేక బృందంతో కలిసి అబిడ్స్ ప్రాంతంలో నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బ్లూ కలర్ బెలెనో కారు అబిడ్స్‌లోని పాయల్ ఫుట్‌వేర్ సమీపానికి చేరుకోగా.. ఓ వ్యక్తి కారులో ఉన్న వ్యక్తికి అనుమానాస్పద ప్యాకెట్ అందజేశాడు. వెంటనే అక్కడే ఉన్న పోలీసులు ప్యాకెట్ ఇచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.కారులో ఉన్న హుస్సేనీ ఆలం ప్రాంతానికి చెందిన సైఫ్‌కు పోలీసులు తమ ఐడీ కార్డులు చూపించి వాహనం నుంచి దిగాలని సూచించారు. అయితే కారు పక్కకు ఆపుతున్నట్లు నటించిన సైఫ్ ఒక్కసారిగా వాహనాన్ని రివర్స్‌లో వేగంగా నడిపాడు. ఈ సమయంలో అడ్డుకునేందుకు ప్రయత్నించిన కానిస్టేబుల్ మహేందర్ యాదవ్ కాలిపై నుంచి కారు వెళ్లడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు.నిందితుడిని వెంబడించిన ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ బృందం అఫ్జల్‌గంజ్ వద్ద కారును అడ్డుకుని సైఫ్‌ను అదుపులోకి తీసుకుంది. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, కానిస్టేబుల్ వంశీధర్ లకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. కాలిపై నుంచి కారు వెళ్లడంతో కానిస్టేబుల్ మహేందర్ యాదవ్‌కు కాలు ఫ్రాక్చర్ కావడంతో వెంటనే ఆయనను సోమాజిగూడలోని యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.మహేందర్ యాదవ్ ఫిర్యాదు మేరకు.. నిందితుడు సైఫ్‌పై అబిడ్స్, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం సైఫ్‌ను హెచ్-న్యూ పోలీసులు అదుపులోకి తీసుకుని డ్రగ్స్ వ్యవహారంపై, ఘటనకు సంబంధించిన ఇతర కోణాలపై విచారణ కొనసాగిస్తున్నారు.

# విద్యార్థులపై ఏకే-47తో కాల్పులు..

## పోలీస్ కానిస్టేబుల్ సస్పెన్షన్



**న్యూ ఢిల్లీ :** విద్యార్థుల నిరసన ప్రదర్శన సందర్భంగా ఏకే-47 తుపాకీతో కాల్పులకు తెగబడిన పోలీసు కానిస్టేబులపై బిహార్ పోలీసు శాఖ తీవ్ర చర్యలు తీసుకుంది. విద్యార్థులపైకి ఆయుధాన్ని గురిపెట్టి కాల్పులు జరుపుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో, సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. దేశవ్యాప్తంగా సాగుతున్న విద్యార్థుల ఉద్యమంలో భాగంగా బిహార్‌లో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆందోళనకారులను అదుపు చేసే క్రమంలో విధుల్లో ఉన్న ఒక పోలీస్ కానిస్టేబుల్.. తన వద్ద ఉన్న ఏకే-47 రైఫిల్‌తో విద్యార్థుల వైపు కాల్పులు జరిపాడు. ఈ దృశ్యాలను అక్కడున్న కొందరు ఫోన్‌లలో వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో తీవ్ర దుమారం రేగింది.

**విపక్షాల ఆగ్రహం..**

ఈ ఘటనపై బిహార్ ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ తీవ్రంగా స్పందించారు. కానిస్టేబుల్ కాల్పులు జరుపుతున్న వీడియోను ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పంచుకుంటూ.. నిరసన తెలుపుతున్న విద్యార్థులపై అత్యాధునిక ఆయుధాలతో విరుచుకుపడటాన్ని తీవ్రంగా ఖండించారు. అటు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులు, విద్యార్థి సంఘాలు కూడా పోలీసుల వైఖరిపై మండిపడ్డాయి. ప్రభుత్వ శాంతియుత చర్చల హామీలకు భిన్నంగా నిరసనకారులపై విచక్షణారహితంగా పోలీసులు దౌర్జన్యానికి దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాయి. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో ఆధారంగా సమగ్ర విచారణకు ఆదేశించిన ఉన్నతాధికారులు, బాధ్యుడైన కానిస్టేబుల్‌పై వేటు వేశారు.

# అధికారులతో మంత్రి శ్రీధర్ బాబు సమీక్ష



**దుండిగల్,ఫ్లాష్ ఇండియా :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రూ.270 కోట్ల వ్యయంతో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దశాబ్దకాలంగా అటవీ శాఖ అనుమతులు లభించక రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అవసరమైన అనువ-ంతులు పొందేలా చర్యలు తీసుకుని, రూ.140 కోట్లతో గండిమైసమ్మ--మియాపూర్ రహదారి, రూ.130 కోట్లతో బహదూరపల్లి--దూలపల్లి రహదారి విస్తరణ పనులను ప్రారంభించినట్లు వెల్లడించారు. అనంతరం సంబంధిత అధికారులతో కలిసి రెండు రహదారి ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించి, పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, కూన శ్రీశైలం గౌడ్, జిల్లా కలెక్టర్ మను చౌదరి, సీఎంసీ కమిషనర్ శ్రీజన, దుండిగల్ డీసీ డాక్టర్ వెంకట మణి కరణ్, తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు హనుమంత్ రెడ్డి, భూపతి రెడ్డి, బొంగునూరి కిషోర్ రెడ్డి, బొంగునూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# నిరసన అంటే లాఠీచార్జి కాదు

## నిరసన తెలిపినంత మాత్రాన లాఠీఛార్జ్ చేయకూడదు



### మతం మారితే ఎస్సీ హోదా వర్తించదు

మత మార్పిడితో ఎస్సీ హోదా కోల్పోతారని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. మతం మారితే ఎస్సీ హోదా వర్తించదని మార్చి 2026లో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై దాఖలైన రివ్యూ పిటిషన్ ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలు కాకుండా ఇతర మతాల్లోకి మారితే ఎస్సీ హోదా ఉండదని తేల్చి చెప్పింది. ఇతర మతం నుంచి క్రైస్తవ మతంలోకి మారిన వ్యక్తికి ఎస్సీ హోదా వర్తించదని, ఎస్సీ హోదా పునరుద్ధరణకు 3 షరతులు తప్పనిసరి అని పేర్కొంది.ఒక వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారిన తర్వాత కూడా ఎస్సీ రిజర్వేషన్ ఫలితాలను లేదా సర్టిఫికేట్‌ను పొందడం చెల్లదని, మత మార్పిడితో ఎస్సీ హోదా స్వయంచాలకంగా రద్దవుతుందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గతంలో స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ బాధితులు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ నిబంధనలకు కట్టుబడి ఉందంటూ, రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టివేసి హైకోర్టు తీర్పును సమర్థించింది.

**న్యూ ఢిల్లీ :** శాంతియుత నిరసన వ్యక్తం చేయడం ప్రజల రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ఆందోళన జరుగుతోందనే కారణంతో లాఠీచార్జి చేయడానికి వీల్లేదని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది. శాంతియు-ంతంగా నిరసన తెలపడం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని తెలిపింది. నిరసనల నియంత్రణలో చట్టబద్ధ విధానాలనే అనుసరించాలని పేర్కొంది. నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా జులై 20న సీజేపీ నేతృత్వంలో విద్యార్థులు చేపట్టిన 'చలో సంసద్' మార్చ్‌పై పోలీసులు టియర్ గ్యాస్, లాఠీఛార్జ్ ప్రయోగించడంపై దాఖలైన పలు పిటిషన్లపై ఇవాళ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చితో కూడిన ధర్మాసనం స్పందిస్తూ.. ఆందోళనలను సాకుగా చూపి పోలీసుల మితిమీరిన బలప్రయోగం సమర్థించలేమని తెలిపింది.

**పోలీసుల జీవితమూ విలువైనదే:**

ఇదే సమయంలో పోలీసుల భద్రతను కూడా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయరాదని, ఆందోళనల్లో ఆకతాయిలు ప్రవేశించి పోలీసులపై దాడులు చేయడం తీవ్ర ఆందోళనకరం అని పేర్కొంది. పోలీసుల జీవితమూ విలువైనదేనని, పోలీసుల చర్యలతో పాటు, నిరసనకారుల హింసపై కూడా నిష్పక్షపాత దర్యాప్తు ఉండాలని స్పష్టం చేసింది. శాంతియుత నిరసనలు, పోలీసుల చర్యలపై దేశమంతటా ఏకరూప మార్గదర్శకాలు అవసరమని పేర్కొంది. ఈ అంశంలో దాఖలైన అన్ని పిటిషన్లు ఒకేసారి విచారిస్తామని తెలిపింది.

**పిటిషన్లలో ప్రధాన డిమాండ్లు:**

జులై 20 నాటి ఘటనపై స్వతంత్ర కమిటీతో నిష్పాక్షిక విచారణ జరిపించాలని అలాగే ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్, పోలీసుల బాడీ కెమెరా రికార్డింగ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ ఆధారాలను భద్రపరచాలని సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. పోలీసుల చర్యల్లో గాయపడిన విద్యార్థులు, నిరసనకారులకు తగిన నష్టపరిహారం చెల్లించాలని ఈ పిటిషనర్లు కోరారు. ఈ నేపథ్యంలో ఈ పిటిషన్లపై స్పందించిన సర్వోన్నత న్యాయత స్థానం పై విధంగా స్పందిస్తూ రేపు అన్ని పిటిషన్లు ఒకేసారి విచారిస్తామని తెలిపింది.

# జెన్ జీ తో సాధ్యమయ్యేనా?



**న్యూ ఢిల్లీ:** నీట్ పేపర్ లీక్‌పై కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళన సక్సెస్ కావడంతో దేశంలో ఇదే తరహాలో మరికొన్ని పోరాటాలు పురుడు పోసుకుంటున్నాయి. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా మరొక భారీ డిజిటల్ ఉద్యమం మొదలైంది. దేశంలో ప్రస్తుతం అమలవుతున్న రిజర్వేషన్ల విధానంలో సమూల మార్పులు తీసుకురావాలని, దేశంలో కులం ప్రస్తావన లేకుండా సరికొత్త చట్టాన్ని తీసుకురావాలన్న ప్రధాన డిమాండ్‌తో 'రిజర్వేషన్ హటావో మూవ్ మెంట్' ప్రారంభమైంది. విద్య, ఉద్యోగ అవకాశాలలో ప్రతిభకు ప్రాధాన్యం ఇస్తూ అందరికీ సమాన ప్రాతిపదికన ఫలాలు అందేలా చట్ట సవరణలు చేయాలని ఆర్‌హెచ్‌ఏ డిమాండ్ చేస్తోంది.

**కులం, రిజర్వేషన్లు పోవాలి:**

ఈ ఉద్యమంపై ఆర్ హెచ్‌ఏ ప్రతినిధులు స్పందిస్తూ తమ ఉద్యమానికి ఏ రాజకీయ పార్టీతోనూ ఎలాంటి సంబంధం లేదని ఇది ఏ రకమైన రాజకీయ ప్రాతిపదికన నడిచే ప్రచారం కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలు, చట్టాల్లో ఎక్కడా 'కులం' ప్రస్తావన లేకుండా సరికొత్త చట్టాన్ని తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యం పేర్కొన్నారు. కుల వివక్షను నిర్మూలించడం తమ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వాలు చెబుతున్నాయని ఇదే నిజమైతే ప్రజల రోజువారీ జీవితంలో కుల గుర్తింపును అడగడం లేదా గుర్తించడం ప్రభుత్వం నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. అగ్రవర్ణాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలంతా తమ కులాన్ని ప్రదర్శించడం చట్టవిరుద్ధం చేయాలని డిమాండ్ చేశారు. సాధారణ ప్రభుత్వం, విద్యాసంస్థల ప్రవేశాలు, ఉద్యోగ దరఖాస్తులు, ఇతర ప్రజా సంబంధిత ప్రక్రియల్లో ఏ పౌరుడూ తన కులాన్ని వెల్లడించాల్సిన లేదా నమోదు చేయాల్సిన అవసరం ఉండకూడదని, ఇందుకోసం కులం, రిజర్వేషన్లు తొలగించాలని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు.

**గంటల వ్యవధిలో లక్షల్లో ఫాలోవర్స్:**

అజిత్ అనే వ్యక్తి ఆర్‌హెచ్‌ఏ పేరుతో ఇన్‌స్టా గ్రామ్ ఖాతాను ప్రారంభించగా అతి తక్కువ కాలంలోనే లక్షల్లో ఫాలోవర్స్ పెరగడం ఇప్పుడు దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అవుతోంది. ప్రస్తుతం ఈ ఖాతాకు 4.2 మిలియన్ ఫాలోవర్స్ రావడం ఇదంతా కేవలం గంటల వ్యవధిలోనే జరిగిపోవడం దేశవ్యాప్తంగా రిజర్వేషన్ల విధానంపై సరికొత్త చర్చ ప్రారంభానికి దారి తీసింది. అనేక మంది నెటిజన్లు ఈ ఉద్యమానికి మద్దతుగా పోస్టులు చేస్తున్నారు. మద్దతు తెలపాలంటూ కామెంట్స్ చేస్తున్నారు. దీంతో పూట పూటకు మద్దతు పెరుగుతున్న ఈ మూవ్‌మెంట్ ఇప్పుడు దేశంలో మరో సంచలనంగా మార పోతోందా అనే చర్చ మొదలైంది. అయితే చిన్న ఆలోచనతో మొదలైన సీజేపీ దేశ రాజకీయాల్లో సంచలనంగా మారిన నేపథ్యంలో ఇప్పుడు ఈ ఆర్‌ఎహ్‌ఏ మూవ్ మెంట్ దేశ రాజకీయాల్లో ఎలాంటి మా-ర్పులకు కారణం కాబోతోంది ఆసక్తి రేపుతోంది.

**జాతీయ రాజకీయాల్లో పెను మార్పు?:**

విభిన్న కులాలు, మతాలు, భాషలు, ప్రాంతాలు, జాతుల సమాహారంతో కూడిన మన దేశంలో కుల ఆధారిత రిజర్వేషన్లు కొనసాగుతున్నాయి. దీంతో కులం లేకపోతే రిజర్వేషన్లు ఎక్కడివి అనే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. ఇదిలా ఉంటే దేశ రాజకీయాల్లో రిజర్వేషన్లు పొలిటికల్ సెంటిమెంట్‌గా మారింది. రిజర్వేషన్ల అంశంతో పెట్టుకుంటే తమ అస్థిత్వానికే ప్రమాదం అనే భయం పార్టీల్లో కొనసాగుతోంది. అందువల్లే రిజర్వేషన్లు తొలగించాలనే చర్చ చాలా కాలం నుంచి వినిపిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు ఎన్ని మారినా ఆ పని చేయలేకపోతున్నాయి. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా అగ్రవర్ణాల్లోని పేదల కోసం 10 శాతం కోటాతో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకురాగా ఇది తమ వర్గాలకు తీరని అన్యాయానికి గురి చేస్తోందని ఓబీసీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలో తాము అధికారంలోకి వస్తే రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం సీలింగ్‌ను ఎత్తేసి జనాభా దమాషా, రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ చెబుతోంది. ఇటువంటి పరిస్థిత-ంల్లో సోషల్ మీడియాలో గంటగంటకు పుంజుకుంటున్న రిజర్వేషన్ హటావో ఆందోళన్ దేశ రాజకీయాల్లో ఎలాంటి మార్పులకు కారణం కాబోతుదో వేచి చూడాలి.

# అమిత్ షా క్షమాపణకు డిమాండ్




**న్యూ ఢిల్లీ :** నీట్ యూపీ పేపర్ లీకేజీ అంశంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో భారీ నిరసనలు, ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిరసనలు ఉద్రిక్తంగా మారడంతో విద్యార్థులపై జరిగిన పోలీసుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష ఎంపీలు సోమవారం పార్లమెంట్ ప్రాంగణంలో తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు విపక్ష ఎంపీలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు ప్రదర్శించిన అరాచకత్వానికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా తక్షణమే క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. చేతుల్లో ప్లకార్డులు, భారీ బ్యానర్లు పట్టుకుని పార్లమెంట్‌లోని 'మకర ద్వార్' మెట్ల వద్ద పెద్ద ఎత్తున ఎంపీలు.. ప్రభుత్వం, హోం శాఖకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థులపై జరిగిన దౌర్జన్యాలకు హోం మంత్రి తగిన సమాధానం చెప్పాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు గళం విప్పారు. ఈ ఘటనపై పార్లమెంట్ లోపల, వెలుపల నిరసనలు మిన్నంటడంతో సభలో వాతావరణం మరింత వేడెక్కింది.

# జనగాంలో జోరుగా నీళ్ల వ్యాపారం

**జనగాంలో నీటి ప్లాంట్ల దందాపై ప్రజల ఆగ్రహం.. చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి**



## డ్యామ్ ఉన్నా తాగునీటికి ప్రైవేటుపైనే ఆధారం

**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జనగాం పట్టణంలో ప్రతి వార్డులో రెండు వరకు ప్రైవేటు తాగునీటి ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో నీటి క్యాన్‌కు రూ.10 నుంచి రూ.20 వరకు వసూలు చేస్తుండటంతో నెలవారీగా కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని వారు చెబుతున్నారు.జనగాం సమీపంలో డ్యామ్ ఉన్నప్పటికీ, తాగునీటి కోసం ప్రైవేటు ప్లాంట్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం డ్యామ్ నీరు గృహ అవసరాలకు మాత్రమే ఉపయోగపడుతోందని, దానిని శుద్ధి చేసి తాగునీటిగా సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.పట్టణంలో నడుస్తున్న నీటి శుద్ధి ప్లాంట్లకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? భూగర్భ జలాల వినియోగానికి సంబంధించి నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపై అధికారులు సమగ్రంగా పరిశీలన చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా నడుస్తున్న ప్లాంట్లపై కఠిన చర్యలు తీసుకుని, తాగునీటి వ్యాపారంలో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.తమ ఫిర్యాదులను రెవెన్యూ, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన స్థాయిలో స్పందన లేదని కొందరు స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని కార్యాలయాల్లో అవినీతి జరుగుతోందనే అనుమానాలను కూడా వారు వ్యక్తం చేశారు. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల స్పందన తెలియాల్సి ఉంది.పట్టణ ప్రజలకు నాణ్యమైన, అందుబాటు ధరలో తాగునీటిని ప్రభుత్వం అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని, అక్రమ నీటి వ్యాపారంపై ప్రత్యేక దర్యాప్తు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.



# అర్హులైన ప్రతి పౌరుడు ఓటు నమోదు చేసుకోవాలి

**మేడిపల్లి,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** మేడ్చల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్-9 మరియు డివిజన్-10 (పీర్జాదిగూడ - మేడిపల్లి) ప్రాంతాల్లో నిర్వహించిన SIR కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్ సింగ్ పాల్గొని ఓటు నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గడపగడపకి కాంగ్రెస్ ప్రతి ఓటర్ కు కాంగ్రెస్ భరోసనిస్తుందని మాజీ మేయర్ అమర్ సింగ్ పేర్కొన్నారు. ఈ సందర్బంగా అమర్ సింగ్ మాట్లాడుతూ గడువు లోపు ప్రతి పౌరుడు సర్ ప్రక్రియను పూర్తిచేసుకోవాలని, పూర్తి చేసిన దరఖాస్తులను బిఎల్ఓ లకు అందచేయాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను అమర్ సింగ్ ఆధ్వర్యంలో బిఎల్ఓ లకు అందజేశా-రు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ , కాంగ్రెస్ జిల్లా SIR పరిశీలకులు సత్యం , బాల్‌రెడ్డి, పీర్జాదిగూడ మాజీ కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆరుతడి పంటలే వేయండి



**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రస్తుత ఎల్‌నినో (వర్షాభావ) పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల సాగును రైతులు విస్తృతంగా చేపట్టాలని, ఇందుకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన విత్తన మేళాలను రైతులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు.సోమవారం, జనగామ మండలంలోని ఓబుల్‌కేశవాపూర్ గ్రామంలో గల రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాళ్లను పరిశీలించి, రైతులతో మాట్లాడారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలను రైతులు విస్తృతంగా సాగు చేయాలని సూచించారు.ప్రతి ప్రాంతంలోని నేల స్వభావం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుంటే పెట్టుబడి తగ్గడంతో పాటు దిగుబడి, ఆదాయం కూడా మెరుగుపడుతుందని తెలిపారు."నాణ్యమైన విత్తనం -- అధిక దిగుబడికి పునాది" అనే లక్ష్యంతో రైతులకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై సరసమైన ధరలకు ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. రైతులు తమ సమీప రైతు వేదికల్లో నిర్వహించే విత్తన మేళాలకు అధిక సంఖ్యలో హాజరై, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సలహాల మేరకు తమ ప్రాంతానికి అనువైన పంటలను ఎంపిక చేసుకుని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు.ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటిగ్రేటెడ్ వ్యవసాయం ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. వ్యవసాయంతో పాటు ఉద్యానవన పంటలు, పశుసంవర్ధక రంగం, కూరగాయల సాగు వంటి అనుబంధ వ్యవసాయ కార్యకలాపాలను కలిపి చేపడితే రైతులకు సంవత్సరం పొడవునా ఆదాయం లభిస్తుందని వివరించారు. ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యాన్ని పెంచుకోవడం ద్వారా ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని కూడా తగ్గించుకోవచ్చన్నారు.కూరగాయల సాగు ద్వారా అనేక మంది రైతులు మంచి లాభాలు పొందుతున్నారని, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉద్యానవన పంటలను సాగు చేస్తే ఆదాయం మరింత పెరుగుతుందని తెలిపారు.పశుసంపద అభివృద్ధికి అవసరమైన మేత పంటల సాగుపై ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ అందిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ప్రతి గ్రామంలోని వ్యవసాయ విస్తరణ అధికారులు (AEOలు) ఉద్యానవన పంటలు, ప్రత్యామ్నాయ పంటలు, ఆధునిక సాగు విధానాలపై రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతుల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వారికి అవసరమైన డ్రిప్ ఇరిగేషన్ సదుపాయాలు, నాణ్యమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు సకాలంలో అందేలా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.జిల్లాలో నాణ్యమైన విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, రైతులకు అవసరమైన ప్రతి విషయంలో జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ భరోసా కల్పించారు.జిల్లాలోని రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.అనంతరం కలెక్టర్ విత్తన మేళాలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించి, అందుబాటులో ఉన్న విత్తనాలను పరిశీలించారు. రైతులకు అందిస్తున్న సేవలు, విత్తనాల నాణ్యత, సరఫరా ఏర్పాట్లపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీధర్ రావు, ఉప సర్పంచ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# బమ్మెర పోతన స్మృతి వనం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** సోమవారం మినీ కాన్ఫరెన్స్ హాల్ లో బమ్మెర పోతన స్మృతి వనం సమగ్ర అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా విస్తృతంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బమ్మెర అభివృద్ధి పనులకు సంబంధించిన సవరించిన అంచనాలను త్వరితగతిన ఖరారు చేసి, టెండర్ ప్రక్రియను ఆలస్యం లేకుండా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.చీఫ్ ఇంజనీర్, ఆర్‌డబి శాఖ టెండర్ ప్రక్రియను అత్యవసరంగా చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు.పర్యాటక శాఖతో సమన్వయం చేసుకొని నిధుల సమీకరణకు చర్యలు తీసుకోవాలని, పనులను దశలవారీగా పూర్తి చేసే విధంగా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు.ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, పరిపాలనా అనుమతులను త్వరితగతిన పూర్తి చేసి, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి బమ్మెర అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారావు, ఇరిగేషన్ శాఖ, పర్యాటక శాఖ, ఆర్‌డబి శాఖ, సంబంధిత శాఖల అధికారులు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# మరణంలోనూ వీడని బంధం..



**నార్కట్ పల్లి,ఫ్లాష్ ఇండియా :** ఏడడుగులు.. మూడుముళ్ల బంధంతో ఒక్కటై సంసార జీవితం గడిపిన ఆ దంపతులు మరణంలోనూ బంధాన్ని వీడలేదు. నార్కట్ పల్లి మండలం తొండలవాయి గ్రామానికి చెందిన శనిగారపు బాలయ్య ఆదివారం మృతి చెందగా, తన భార్య శనిగారపు చంద్రమ్మ సోమవారం మృతి చెందింది. భార్యాభర్తలిద్దరూ ఒక్కసారి చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. తన భర్త మరణాన్ని తట్టుకోలేకనే భార్య మృతి చెందిందని కుటుంబ సభ్యులు రోధించారు. భార్యాభర్తలు మరణంలోనూ వీడని బంధాన్ని రాసుకున్నారని గ్రామ-స్తుల నోట మాట.

# ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత తప్పనిసరి



**ప్రతి నీటి బొట్టు ను ఒడిసి పట్టి భూగర్భ జలాలను కాపాడుకుందాం**
**ఇంకుడు గుంతల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి**
**పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్**

**మేడ్చల్,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోని వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిదని, ఇంకుడు గుంతలు ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఇంకుడు గుంత ఏర్పాటు చేయకుండా బోర్లకు అనుమతించరాదని, దీన్ని ఒక సామాజిక బాధ్యతగా ప్రతి పౌరుడు పాటించాలని పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. గత 25 సంవత్సరాలుగా తన ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటినికాపాడుకుంటున్నానని ఈ సందర్భంగా తెలిపారు. ప్రతి సంవత్సరం ఇంకుడు గుంతలు శుభ్రం చేసి మరల ఇసుక నింపి ఇంకుడు గుంతద్వారా వర్షపు నీటిని కాపాడుకుంటున్నానని తెలిపారు. సమస్త జీవరాసులకు వర్షపు నీరే జీవనాధారం అని, గత 15 సంవత్సరాల క్రితం తన ఇంటిలో 300 అడుగుల లోతు వేసిన బోరుబావిలో ఇప్పటికీ నీరు లభిస్తుందని తెలిపారు. వర్షపు నీటి సంరక్షించకపోతే రాబోయే రోజుల్లో తాగడానికి చుక్క నీరు దొరుకదని ఘో-రమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు.ఇళ్ల నిర్మాణము లేఔట్ పర్మిషన్లుకు ఇంకుడు గుంతల ఏర్పాటు నిబంధనలో చేర్చాలి ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఉన్నప్పుడే భవన నిర్మాణ అనుమతులు లేఔట్ పర్మిషన్ రిజిస్ట్రేషన్ అనుమతి ఇచ్చే విధంగా ప్రభుత్వం నిబంధనలను రూపొందించాలని ఆయన సూచించారు. ప్రస్తుతం నగరంలో ఎక్కడ చూసినా సిమెంట్ రోడ్లు, అపార్ట్మెంట్ నిర్మాణాలు పెరుగుతుండడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశం తగ్గిపోతుందని అన్నారు. ఇంకుడు గుంతల ఏర్పాటుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ వివిధ శాఖల అధికారులను కోరారు.



# ప్రజావాణికి 12 దరఖాస్తులు..

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఆఫీస్ నందు ఆర్డీవో ఎస్ రమణారెడ్డి సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డివిజన్ వ్యాప్తంగా 12 దరఖాస్తులు వచ్చాయి.సబ్ కలెక్టర్ కార్యాలయం మిర్యాలగూడకు 3, తహసిల్దార్ ఆఫీస్ పెద్దవూర కు 1, తహసిల్దార్ ఆఫీస్ మాడుగుల పళ్ళికి 1, తహసిల్దార్ ఆఫీస్ నిడమనూరుకు 1, తహసిల్దార్ ఆఫీస్ త్రిపురారం కు 1, తహసిల్దార్ ఆఫీస్ వేములపల్లికి 1, తహసిల్దార్ ఆఫీస్ దామరచర్లకు 1, మిర్యాలగూడ మున్సిపాల్ ఆఫీస్ కు 1,డిఈఈ ఆర్ అండ్ బి ఆఫీస్ మిర్యాలగూడకు 1 దరఖాస్తులు వచ్చినవి. ఈ సందర్భంగా ఆర్డీవో రమణారెడ్డి మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తులకు సత్వరపరిష్కారమే ధ్యేయంగా ప్రజావాణి కార్యక్రమం నడు-స్తుందని,సంబంధిత అధికారులు వచ్చిన దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పలు శాఖలకు సంబంధించిన డివిజన్ స్థాయి అధికారులు,పలు మండలాలకు చెందిన తహసిల్దార్ లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకం పేరుతో వృద్ధులే టార్గెట్..



**యాదాద్రి భువనగిరి,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వ ఉచిత పథకాల పేరుతో వృద్ధులను నమ్మించి బంగారు నగలను అపహరిస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులను యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం భువనగిరి డీఎస్పీ రవీందర్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. బీబీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 12న జరిగిన చైన్ స్నాచింగ్ కేసును ఛేదించిన పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మూడు తులాల బంగారు మంగళ సూత్రంతో పాటు నేరానికి ఉపయోగించిన పల్సర్ ఎన్ఎస్-200 బైక్, ఐఫోన్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సత్యసాయి జిల్లాకు చెందిన సింహాద్రి గంగాధరప్ప, కర్ణాటక రాష్ట్రంలోని చిక్కబళ్లాపూర్ జిల్లా గౌరిబిదనూరు తాలూకాకు చెందిన జంగాల శివరాజ్ కలిసి వృద్ధులను లక్ష్యంగా చేసుకుని ఈ త-రహా నేరాలకు పాల్పడుతున్నారు.

**ప్రభుత్వ అధికారులమంటూ నమ్మించి...**

ఈ నెల 12న బీబీనగర్ పట్టణానికి చెందిన కుక్కడువ్వ అండాలు తన భర్తతో కలిసి ఇంట్లో ఉండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై అక్కడికి చేరుకున్నారు. తమను ప్రభుత్వ ఉచిత బియ్యం పంపిణీ పథకానికి సంబంధించిన అధికారులమని పరిచయం చేసుకుని, ఉచిత బియ్యం పొందేందుకు అర్హతను పరిశీలించాల్సి ఉందని తెలిపారు. అనంతరం వివరాలు నమోదు చేయడానికి ఫొటో తీయాలని చెప్పి, "మెడలో ఉన్న బంగారు గొలుసు ఫొటోకు అడ్డుగా వస్తోంది... దాన్ని తీసేయండి" అంటూ వృద్ధురాలిని నమ్మించారు. ఆమె మెడలోని మంగళసూత్రాన్ని తీసిన వెంటనే నిందితులు ఆమెను తోసివేసి సుమారు మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని బైక్‌పై పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు.


**ఏపీ, కర్ణాటకలోనూ కేసులు...**

ఈ ఇద్దరు నిందితులపై గతంలోనూ ఆంధ్రప్రదేశ్‌లోని పెనుకొండ, గోరంట్ల, లేపాక్షి పోలీస్ స్టేషన్లతో పరిధిలో కూడా పలు చైన్‌స్నాచింగ్, మోసపూరిత నేరాల కేసులు నమోదైనట్లు విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు. ఈ సమావేశంలో బీబీనగర్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్ రెడ్డి ఎస్ఐలు రమేష్, కృష్ణయ్య, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

# అన్నారం పేదల భూములపై టీజీఐఐసీ నీడ..

**జిన్నారం,ఫ్లాష్ ఇండియా :** గుమ్మడిదల మున్సిపల్ అన్నారం సర్వేనంబర్ 261 లో గల పేదల భూములను తెలంగాణ టీజీ అయి ఇచ్చేది లేదని అన్నారం గ్రామస్తులు అంటున్నారు. అన్నారం గ్రామానికి చెందిన అఖిల పక్ష నాయకులు, బాధిత రైతులు తాము సాగు చేసుకుంటున్న భూములను టీజీ ఐఐసీ ఇవ్వమని జిల్లా కలెక్టర్ కలిసి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కి వినతి పత్రం ఇచ్చారు. సర్వేనెంబర్ 261 లో నిరుపేద బడుగు బలహీన వర్గాల వారికి మాత్రమే అసైన్డ్ భూములు ఉన్నాయని, ఆ రైతులు ఆ భూముల పై జీవనం కొనసాగిస్తున్నారని కలెక్టర్ కి తెలిపారు. టీజీ ఐఐసీకి ప్రభుత్యం ఆ భూములని ఇవ్వొద్దని కోరారు. ప్రభుత్వం వెంటనే టీజీ ఐఐసీ కేటాయించే ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని రైతులు, గ్రామ నాయకులు డిమాండ్ చేశారు.





# భారత్ ఖాతాలో మరో పతకం..

గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత క్రీడాకారులు తమ సత్తా చాటుతున్నారు. తాజాగా వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ మరో పతకాన్ని ఖాతాలో వేసుకుంది. 65 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో భారత వెయిట్‌లిఫ్టర్ రాజా ముత్తుపాండి రజత పతకాన్ని కైవసం చేసుకుని దేశానికి గర్వకారణంగా నిలిచాడు. ఫైనల్లో రాజా ముత్తుపాండి స్నాచ్, క్లీన్ అండ్ జర్క్ విభాగాల్లో కలిపి 286 కిలోగ్రాముల బరువును ఎత్తి రెండో స్థానంలో నిలిచాడు. అతని అద్భుత ప్రదర్శనతో భారత్‌కు మరో విలువైన పతకం లభించింది.

**ప్రపంచ రికార్డుతో స్వర్ణం గెలిచిన మలేషియా క్రీడాకారుడు**

ఈ విభాగంలో మలేషియాకు చెందిన అజ్నిల్ బిన్ బిదిన్ ముహమ్మద్ అసాధారణ ప్రదర్శన కనబరిచాడు. మొత్తం 299 కిలోగ్రాములు ఎత్తి ప్రపంచ రికార్డును బద్దలు కొట్టడమే కాకుండా స్వర్ణ పతకాన్ని కూడా సొంతం చేసుకున్నాడు. ఇక పాపువా న్యూ గినియాకు చెందిన మోరేయా బారు కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. చివరి వరకు రాజా ముత్తుపాండితో గట్టి పోటీ ఇచ్చినా, భారత వెయిట్‌లిఫ్టర్ తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుని రజత పతకాన్ని దక్కించుకున్నాడు. ఈ విజయంతో కామన్వెల్త్ గేమ్స్ 2026లో వెయిట్‌లిఫ్టింగ్, పవర్ వెయిట్‌లిఫ్టింగ్ విభాగాల్లో భారత్ మొత్తం నాలుగు పతకాలు సాధించింది.

**ఎన్నో కష్టాల తర్వాత ఈ విజయం**

రాజా ముత్తుపాండి క్రీడా ప్రయాణం సవాళ్లతో నిండింది. 2017లో యూత్ కామన్వెల్త్ గేమ్స్, జూనియర్ ఛాంపియన్‌షిప్‌లలో పతకాలు గెలిచి తన ప్రతిభను చాటుకున్నాడు. అనంతరం 2019లో లిగమెంట్ గాయం కారణంగా కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌కు దూరమయ్యాడు. గాయానికి శస్త్రచికిత్స చేయించుకోవడంతో చాలా కాలం పోటీలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. 2021లో జాతీయ ఛాంపియన్‌షిప్‌లో మూడో స్థానం సాధించినప్పటికీ, 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌కు అర్హత సాధించలేకపోయాడు.

**బలమైన పునరాగమనం**

అయితే రాజా వెనక్కి తగ్గలేదు. కఠిన సాధనతో తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు. 2024లో 61 కేజీల విభాగంలో జాతీయ రికార్డును బద్దలు కొట్టాడు. అనంతరం 2025 కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించి తన పునరాగమనాన్ని చాటిచెప్పాడు. ఇప్పుడు కామన్వెల్త్ గేమ్స్‌లో రజత పతకం గెలవడంతో అతని ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. తదుపరి లక్ష్యంగా లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో భారత్‌కు పతకం అందించడమే తన ప్రధాన ధ్యేయంగా రాజా ముత్తుపాండి ముందుకు సాగుతున్నాడు.

**భారత్‌కు మరో గర్వకారణం**

గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో భారత వెయిట్‌లిఫ్టర్ల అద్భుత ప్రదర్శన కొనసాగుతోంది. రాజా ముత్తుపాండి సాధించిన ఈ రజత పతకం భారత క్రీడా చరిత్రలో మరో మైలురాయిగా నిలిచింది. అతని పట్టుదల, కష్టపడే తత్వం యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

# బీసీసీఐపై తెలుగు ప్లేయర్ ఫైర్!




భారత జట్టు ఎంపిక విధానంపై టీమిండియా మాజీ క్రికెటర్, తెలుగు ఆటగాడు హనుమ విహారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. వరుసగా విఫలమవుతున్నప్పటికీ అభిషేక్ శర్మకు జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో అవకాశాలు ఇవ్వడంపై మండిపడ్డాడు. టీ20 ప్రపంచ కప్ 2026లో అద్భుతంగా రాణించిన సంజు శాంసన్‌కు మాత్రం ఎందుకు సరైన అవకాశాలు ఇవ్వలేదని ప్రశ్నించాడు. 2-3 మ్యాచ్‌లలో విఫమైన సంజును జట్టు నుంచి తీసేశారని.. అభిషేక్‌ను మాత్రం కొనసాగిస్తున్నారని మండిపడ్డాడు. అభిషేక్‌కు ఓ రూల్.. సంజుకు మరో రూలా? అంటూ ఫైర్ అయ్యాడు. హనుమ విహారి తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ... 'ప్రపంచ కప్‌కు ముందు సంజు శాంసన్ ఐదు మ్యాచ్‌ల్లో రాణించకపోవడంతో తుది జట్టులో స్థానం కోల్పోయాడు. తిరిగి అవకాశం వచ్చిన తర్వాత ప్రపంచ కప్‌లో అద్భుత ప్రదర్శన చేసి ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచాడు. అభిషేక్ శర్మ ప్రదర్శనను పరిశీలిస్తే పరిస్థితి భిన్నంగా ఉంది. ఇంగ్లండ్ పర్యటనలో ఒక అర్ధశతకం మినహా అభిషేక్ బ్యాట్ నుంచి చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ రాలేదు. 20 లేదా 30 పరుగుల ఇన్నింగ్స్ కూడా లేవు. చివరి ఎనిమిది మ్యాచ్‌ల్లో ఒక్క అర్ధశతకం మాత్రమే చేశాడు. ప్రపంచ కప్ మ్యాచ్‌లను కలుపుకుంటే చివరి 18 ఇన్నింగ్స్‌లో కేవలం మూడు అర్ధ శతకాలే ఉన్నాయి' అని వివరించాడు. 'సంజు శాంసన్ టీ20 ప్రపంచ కప్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ వరుసగా అర్ధ శతకాలు సాధించి భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయినప్పటికీ ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ వంటి యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వడంతో అతడు మళ్లీ ప్లేయింగ్ ఎలెవన్‌కు దూరమయ్యాడు. సంజూను ఇన్‌కన్సిస్టెంట్ అంటారు. అది సరే కానీ ఒత్తిడి పరిస్థితుల్లో మ్యాచ్‌ను ఒంటిచేత్తో గెలిపించే సామర్థ్యం అతనికి ఉంది. అభిషేక్ శర్మ చుట్టూ భారీ హైప్ ఉంది. కానీ సంజు కూడా ఐపీఎల్‌లో అద్భుతంగా రాణించాడు. ఇద్దరు ఆటగాళ్ల విషయంలో ఎందుకు వేర్వేరు ప్రమాణాలు పాటిస్తున్నారు?' అంటూ హనుమ విహారి బీసీసీఐ సెలెక్టర్లను ప్రశ్నించాడు. విహారి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.




# నా కల నిజమైంది..

జింబాబ్వే పర్యటనలో భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శనతో మరోసారి అందరి ప్రశంసలు అందుకున్నాడు. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన మూడో టీ20లో 49 బంతుల్లో 81 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడి.. భారత్‌కు 35 పరుగుల తేడాతో గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ సిరీస్‌లోని మూడు మ్యాచ్‌లలో బుడ్డోడు 151 రన్స్ చేశాడు. వైభవ్ అద్భుత బ్యాటింగ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డుతో పాటు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును కూడా అందుకున్నాడు.

**నాపై పూర్తి నమ్మకం ఉంచారు:**

మ్యాచ్ అనంతరం మాట్లాడిన వైభవ్ సూర్యవంశీ జింబాబ్వే సిరీస్ తనకు ఎంతో ప్రత్యేకమని చెప్పాడు. 'గత మూడు రోజులుగా మా ప్రిపరేషన్ చాలా బాగా జరిగింది. నేను అండర్-19 ప్రపంచ కప్ 2026 హరారేలో ఆడాను. అందుకే ఈ మైదానంలో ఆడటం నాకు చాలా ఇష్టం. కెప్టెన్, కోచ్‌లు, జట్టులోని ప్రతి ఒక్కరూ నాపై పూర్తి నమ్మకం ఉంచారు. వారి మద్దతు వల్లే నేను స్వేచ్ఛగా ఆడగలిగాను. అందుకు చాలా సంతోషంగా ఉంది. ఐపీఎల్‌లో నేను ఎలా ఆడనో, ఇక్కడ కూడా అదే విధంగా ఆడాడనికి ప్రయత్నించాను. ప్రతి మ్యాచ్‌లో జట్టుకు మంచి ఆరంభం ఇవ్వడమే నా లక్ష్యం. ఒకసారి మంచి స్టార్ట్ లభిస్తే దాన్ని పెద్ద ఇన్నింగ్స్‌గా మార్చాలని అనుకున్నాను. అదే నా ఆలోచన' అని వైభవ్ వివరించాడు.


**దూకుడుగా ఆడడానికే ప్రయత్నిస్తా:**

తాను మ్యాచ్‌లో ఆడే షాట్లు అన్నీ నెట్స్‌లో సాధన చేసినవేనని వైభవ్ చెప్పాడు. 'ప్రాక్టీస్‌లో ఏ షాట్స్ ఆడుతానో, మ్యాచ్‌లో కూడా అవే షాట్లు ఆడేందుకు ప్రయత్నిస్తాను. సాధనలో చేసినదాన్ని మ్యాచ్‌లో అమలు చేయడమే నా విధానం. భారత్ తరఫున జింబాబ్వేపై పూర్తి సిరీస్ ఆడాను. కెరీర్ ఆరంభంలోనే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు అందుకోవడంతో నా కల నిజమైంది. రెండు అవార్డులు ఒకేసారి అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. టీమిండియా తరఫున ఆడడం ఎప్పుడూ బాగుంటుంది. ఇకపై కూడా ఇలానే దూకుడుగా ఆడడానికే ప్రయత్నిస్తా' అంటూ బుడ్డోడు తన సంతోషాన్ని అభిమానులతో పంచుకున్నాడు.

**సిరీస్ విజయంలో కీలక పాత్ర:**

జింబాబ్వే సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన నిలకడను ప్రదర్శించాడు. తొలి టీ20లో ఫాస్టెస్ట్ అర్ధ శతకం (18 బంతుల్లో 50), రెండో మ్యాచ్‌లో మెరుపు ఇన్నింగ్స్ (9బంతుల్లో 20), మూడో మ్యాచ్‌లో మరో తుఫాన్ ఇన్నింగ్స్ (49 బంతుల్లో 81 పరుగులు)తో జట్టుకు బలమైన ఆరంభాలు అందిస్తూ సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. వైభవ్ ఆటపై ప్రశంసల వర్షం కురుస్తోంది. భవిష్యత్ భారత క్రికెట్‌కు మరో స్టార్‌గా వైభవ్ ఎదుగుతున్నాడనే అభిప్రాయాన్ని తన ప్రదర్శనతో మరింత బలపరిచాడు.

# బిజినెస్




# ప్లేస్టోర్‌లో ఫేక్ యాప్..


గూగుల్ ప్లేస్టోర్‌లో ఉన్న ఒక నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ యాప్ ద్వారా తాను రూ. 7.95 లక్షలు నష్టపోయానని, బ్యాక్ చెకింగ్ లేకుండా ఇలాంటి మోసపూరిత యాప్‌లకు అనుమతినిచ్చిన గూగుల్ ఇండియా నోడల్ హెడ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. రామచంద్రాపురం ప్రాంతానికి చెందిన 58 ఏళ్ల బీడీఎల్ ఉద్యోగికి మార్కెట్ రీసెర్చ్ గ్రూప్ పేరుతో వాట్సప్‌లో సందేశం రాగా, అందులోని సభ్యులు స్టాక్ మార్కెట్ సలహాల పేరుతో ఆయనను నమ్మించి గూగుల్ ప్లేస్టోర్ నుంచి 'జీవీఎస్ ఇన్‌స్టిట్యూషన్' అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. గూగుల్ ప్లేస్టోర్‌లో లభ్యమవుతున్న యాప్ కాబట్టి సురక్షితమైనదేనని నమ్మిన సదరు ఉద్యోగి, ఈ నెల 10 నుంచి 26వ తేదీ మధ్య మొత్తం రూ. 7.95 లక్షలు పెట్టుబడి పెట్టారు. యాప్‌లో ఆయన పెట్టుబడికి రూ. 27.75 లక్షల లాభం వచ్చినట్లు చూపించినప్పటికీ, ఆ సొమ్మును విత్‌డ్రా చేసుకునేందుకు నిర్వాహకులు నిరాకరించారు. పైగా పన్నుల రూపంలో అదనంగా రూ. 9.26 లక్షలు చెల్లిస్తేనే డబ్బులు విత్‌డ్రా అవుతాయని కండిషన్ పెట్టడంతో తాను తీవ్రంగా మోసపోయానని గ్రహించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. నిబంధనలకు విరుద్ధంగా నకిలీ యాప్‌ను ప్లాట్‌ఫామ్‌పై ఉంచిన గూగుల్ ఇండియా యాజమాన్యం నిర్లక్ష్యంపై, అలాగే మోసానికి పాల్పడిన సైబర్ ముఠాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.




# ఫుడ్ డెలివరీ రంగంలోకి ఫ్లిప్‌కార్ట్


ఫుడ్ డెలివరీ రేసులోకి ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ గ్రాండ్ ఎంట్రీ ఇవ్వడానికి ముమ్మరంగా సిద్ధమవుతోంది! వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఈ సంస్థ భారత్‌లో త్వరలోనే తన ఫుడ్ డెలివరీ సేవలను ప్రారంభించనుందని సమాచారం. ప్రారంభంలో భాగంగా ముందుగా బెంగళూరు నగరంలో పైలట్ ప్రాజెక్ట్‌గా ఈ సేవలను అందుబాటులోకి తేనుంది. అక్కడ వచ్చే ఫలితాలు, సాంకేతికతను పరిశీలించిన తర్వాతే ఇతర ప్రధాన నగరాలకు దీనిని విస్తరించాలని యోచిస్తోందట. ఇప్పటికే తీవ్ర పోటీ ఉన్న ఫుడ్ డెలివరీ మార్కెట్‌లో నిలదొక్కుకోవడానికి కస్టమర్లకు బలమైన, ఆకర్షణీయమైన ఆఫర్లతో కూడిన ప్రతిపాదనలను సిద్ధం చేసే పనిలో ఫ్లిప్‌కార్ట్ నిమగ్నమైంది. ఈ సేవలను ప్రత్యేక యాప్ ద్వారా అందించడంతో పాటు 'ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్' ప్లాట్‌ఫామ్‌పై కూడా అందుబాటులో ఉంచే అంశాన్ని సంస్థ పరిశీలిస్తోంది. అయితే, ఈ సర్వీస్ లాంచ్ సమయంపై ఫ్లిప్‌కార్ట్ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. ఒకవైపు ఫుడ్ డెలివరీలోకి అడుగుపెడుతున్న తరుణంలోనే, మరోవైపు ఫ్లిప్‌కార్ట్ తీవ్రమైన వ్యాపార వివాదాల్లో చిక్కుకోవడం గమనార్హం. ఫ్లిప్‌కార్ట్ మార్కెట్‌లో పోటీని దెబ్బతీసేలా అనుచిత, వివక్షాపూరిత వ్యాపార విధానాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ 'ఫోరమ్ ఫర్ ఇంటర్నెట్ రిటైలర్స్, సెల్లర్స్ అండ్ ట్రేడర్స్' సంస్థ ఇటీవల కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా ని ఆశ్రయించింది. ఫ్లిప్‌కార్ట్ GST మినహాయింపుల ద్వారా దాదాపు 3,000 కోట్ల రూపాయల నిధులను సమకూర్చుకుందని, ఆ సొమ్ముతో భారీ డిస్కౌంట్లు ఇస్తూ స్వతంత్రంగా వ్యాపారం చేసుకునే చిన్న అమ్మకందారుల పొట్టకొడుతోందని ఈ ఫిర్యాదులో తీవ్రస్థాయిలో ఆరోపించింది.

# దిగి వచ్చిన ముడి చమురు ధరలు..




అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు దిగివచ్చాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర ఏకంగా 4.3 శాతం తగ్గి 92 డాలర్ల దగ్గర ట్రేడ్ అవుతోంది. మరోవైపు బ్యాంకింగ్ సెక్టార్, ఎఫ్ఎమ్‌సీజీ రంగాల్లో కొనుగోళ్లు సూచీలను ముందుకు నడిపిస్తున్నాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ (96.24) బలపడింది. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ భారీ లాభాల్లో కదలాడుతున్నాయి. గత సెషన్ ముగింపు (76,059)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు 600 పాయిట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ అదే జోరు కొనసాగిస్తోంది. ఉదయం 9:40 గంటల సమయంలో సెన్సెక్స్ 627 పాయింట్ల లాభంతో 76,687 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడుతోంది. ప్రస్తుతం 176 పాయింట్ల లాభంతో 23,943 వద్ద ఉంది. సెన్సెక్స్, నిఫ్టీలో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఒరాకిల్ ఫిన్‌సెర్వ్, కేఫిన్ టెక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్, లారస్ ల్యాబ్స్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి . ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, మోతీలాల్ ఓస్వాల్, పేటీఎమ్ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 488 పాయింట్ల లాభంతో ఉంది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 667 పాయింట్ల లాభంతో ఉంది.

# గ్యాస్ సిలిండర్ ధరలు



గత నెలలో గ్యాస్ సిలిండర్ ధరల పెరుగుదలపై ప్రజలు ఆందోళన చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ నెల(జులై) ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం హోటళ్లు, రెస్టారెంట్లు తదితర వ్యాపారులకు ఊరటనిస్తూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించింది. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.183 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.3,191గా ఉంది. ఇక, గృహ వినియోగ ఎల్‌పిజి ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. ప్రస్తుతం(జులై 27) తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

**గ్యాస్ సిలిండర్ ధరలు..**

హైదరాబాద్: రూ.994.00
వరంగల్: రూ.1013.00
విశాఖపట్నం: రూ.950.00
విజయవాడ: రూ.966.50
గుంటూరు: రూ.966.50




# ఓటీటీ స్ట్రీమింగ్‌కు రెడీ

వరుణ్ ధావన్, మృణాల్ ఠాకూర్, పూజా హెగ్డే ప్రధాన పాత్రల్లో నటించిన రొమాంటిక్ కామెడీ చిత్రం 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'. ఈ చిత్రం జూన్ 5, 2026న భారీ అంచనాల నడుమ విడుదలైనప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఈ మూవీ డిజిటల్ హక్కులను 'జీ5' సంస్థ సొంతం చేసుకోగా, జూలై 31 నుంచి హిందీ భాషలో స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. థియేటర్లలో ఆశించిన ఫలితం అందుకోలేకపోయిన ఈ చిత్రం, ఓటీటీలో ఎలాంటి ఆదరణ పొందుతుందో చూడాలి. డేవిడ్ ధావన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని టిప్స్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రమేష్ తౌరానీ నిర్మించారు. మనీష్ పాల్, చంకీ పాండే, జిమ్మీ షెర్గిల్, మౌనీ రాయ్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు.

# ఆ సూపర్ స్టార్‌తో డిన్నర్ డేట్...

దీనికి ఆమె ఏమాత్రం ఆలోచించకుండా స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి పేరును చెప్పి అందర్నీ ఆశ్చర్యపరిచింది. అంతేకాకుండా అనుష్క గురించి మాట్లాడుతూ, ఆమె తనకు ఎంతో ఇష్టమైన నటి మాత్రమే కాదని, అద్భుతమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అని భాగ్యశ్రీ ప్రశంసించింది. అనుష్క ఇండస్ట్రీలోకి వచ్చినప్పటి నుంచి ఆమె జర్నీని తాను ఎంతో అభిమానంతో గమనిస్తున్నానని వెల్లడించింది. నటిగా మాత్రమే కాదు, వ్యక్తిగా కూడా అనుష్కను ఎంతో గౌరవిస్తానని చెప్పింది.అవకాశం దొరికితే అనుష్కను దగ్గరగా కలుసుకుని, ఆమెతో ప్రశాంతంగా కూర్చొని మాట్లాడాలని తనకు ఎంతో కోరిక ఉందని భాగ్యశ్రీ తెలిపింది. ఆమె అనుభవాలు, ఆలోచనలు తెలుసుకోవాలని, కొంత సమయం కలిసి గడపాలని ఆశిస్తున్నట్లు చెప్పింది. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తెలుగు సినీ పరిశ్రమలో అనుష్క శెట్టికి ఉన్న ప్రత్యేక స్థానం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తన సింప్లిసిటీ, ప్రవర్తన, నటనతో ఆమె అభిమానులనే కాదు, సహనటులు, కొత్త తరానికి చెందిన నటీనటుల గౌరవాన్నీ సంపాదించుకున్నారు. అందుకే భాగ్యశ్రీ బోర్సే చేసిన ఈ వ్యాఖ్యలు కూడా అనుష్క అభిమానులను ఆనందానికి గురిచేస్తున్నాయి. మరోవైపు 'లెనిన్' విజయంతో భాగ్యశ్రీ బోర్సేకు టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలు వచ్చే అవకాశం కనిపిస్తోంది. తొలి హిట్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, భవిష్యత్తులో కూడా విభిన్న పాత్రలు ఎంచుకుంటూ తన కెరీర్‌ను మరింత బలంగా నిర్మించుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు.



# సెకండ్ సింగిల్ రిలీజ్ డేట్ ఫిక్స్




మాస్ మహారాజా రవితేజ ప్రస్తుతం 'ఇరుముడి' చిత్రంలో హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 21న విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి తొలి పాటను విడుదల చేసిన మేకర్స్, ఇప్పుడు రెండో పాట విడుదలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఈ సినిమా రెండో సింగిల్‌ను జూలై 29న విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా త్వరలోనే వెలువడే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ప్రియ భవాని శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బేబీ నక్షత్ర కీలక పాత్రలో కనిపించనుంది. సాయికుమార్ ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు.




# యూరప్‌లో కాదు..

జూనియర్ ఎన్టీఆర్ హీరోగా, స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'డ్రాగన్' షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటికే భారీ అంచనాలు ఉన్న ఈ సినిమా తాజా షెడ్యూల్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ఈ షెడ్యూల్ కోసం చిత్ర బృందం ప్రత్యేకంగా యూరప్ ని తలపించే భారీ సెట్‌ను నిర్మించింది. ఈ ప్రత్యేక సెట్‌లో ఎన్టీఆర్‌పై హై వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. సినిమాకు కీలకంగా నిలిచే ఈ యాక్షన్ సన్నివేశాల కోసం భారీ స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. యూరప్‌లో చిత్రీకరించినట్లే కనిపించేలా సెట్ డిజైన్ చేయడం ద్వారా ప్రేక్షకులకు కొత్త విజువల్ అనుభూతిని అందించేందుకు మేకర్స్ ప్రయత్నిస్తున్నారు.ప్రశాంత్ నీల్ సినిమాలకు యాక్షన్ సన్నివేశాలే హైలెట్ గా నిలుస్తాయి. అదే తరహాలో 'డ్రాగన్'లో కూడా కళ్ళు చెదిరే భారీ యాక్షన్ సీక్వెన్స్ ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్‌లో ఎన్టీఆర్ కీలక సన్నివేశాలను పూర్తి చేస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాతో తొలిసారి జూనియర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్ కుదరడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఒకవైపు ఎన్టీఆర్ మాస్ ఇమేజ్, మరోవైపు ప్రశాంత్ నీల్ స్టైలిష్ మేకింగ్ కలిసి వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ సృష్టిస్తాయో అన్న ఆసక్తి రోజురోజుకు పెరుగుతోంది. ఇప్పటికే ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా మంచి బజ్ ఏర్పడింది. భారీ నిర్మాణం, పవర్‌ఫుల్ యాక్షన్, అంతర్జాతీయ స్థాయి విజువల్స్‌తో 'డ్రాగన్' ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతున్న ఈ షెడ్యూల్ పూర్తయిన తర్వాత తదుపరి షూటింగ్ వివరాలను చిత్ర బృందం ప్రకటించే అవకాశం ఉంది.

# వైల్డ్ పోస్టర్ షేర్ చేసిన మేకర్స్




రాకింగ్ స్టార్ యశ్, డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ కలయికలో వస్తోన్నచిత్రం 'టాక్సిక్'. కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే వచ్చిన ప్రతి అప్డేట్ ఆకట్టుకోగా.. సినిమాపై భారీ హైప్ క్రియేట్ అయ్యింది. ఇక టాక్సిక్ చిత్రం భారీ అంచనాలు మధ్య ఆగస్టు 26వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు రాబోతుంది. దీంతో ప్రమోషన్స్‌లో జోరు పెంచిన మేకర్స్.. తాజాగా అదిరిపోయే పోస్టర్‌ను వదిలారు. ఈ మేరకు 'టాక్సిక్ నెల ఘనంగా మొదలవుతోంది.. వేచి ఉండండి' అంటూ ఓ పవర్ ఫుల్ పోస్టర్‌ను షేర్ చేశారు. ఇందులో యశ్.. వైల్డ్ లుక్‌లో కనిపిస్తుండగా.. చేతి నిండా బ్లడ్‌తో దర్శనమిచ్చాడు. ప్రజెంట్ ఈ పోస్టర్ వైరల్ అవుతూ సినిమాలో వైల్డ్ పోర్షన్‌ను ప్రజెంట్ చేస్తుంది.




# దర్శకుడిగా మరో హీరో..

ఈ మధ్య కాలంలో టాలీవుడ్ హీరోలు.. నిర్మాతలుగా, డైరెక్టర్లుగా మారుతూ ట్రెండ్ సెట్ చేస్తున్నారు. ఇప్పటికే రామ్ పోతినేని, కిరణ్ అబ్బవరం తమ తదుపరి సినిమాలకు దర్శకత్వం వహిస్తుండగా.. తాజాగా ఆ లిస్టులో హీరో సుధీర్ బాబు చేరిపోయాడు. నటుడిగా, నిర్మాతగా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సుధీర్ బాబు, త్వరలో దర్శకుడిగా మెగా ఫోన్ పట్టబోతున్నాడు. ఈ మేరకు దర్శకుడిగా మారి ఒక డ్రీమ్ ప్రాజెక్టును తెరకెక్కించడానికి సిద్ధవ-ంవుతున్నాడట. గత కొంత కాలంగా ఒక విభిన్నమైన కథాంశంపై పని చేస్తున్న ఆయన.. కథ మీద నమ్మకంతో ఆయనే దర్శకత్వం బాధ్యతలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారని టాలీవుడ్ వర్గాల నుంచి సమాచారం. ఆయన స్వీయ డైరెక్షన్‌లో రాబోతున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉందని తెలుస్తుండగా.. త్వరలోనే దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాబోతున్నట్లు సమాచారం.




# ఆ తేదీ నుండి స్ట్రీమింగ్

టాలీవుడ్ సీనియర్ నటుడు శ్రీకాంత్ ప్రధాన పాత్రలో నటించిన వెబ్ సిరీస్ 'ఆబ్జెక్షన్ మై లార్డ్ -- నోటరీ పరశురామ్: చాప్టర్ 1'. ఇందులో ముఖేష్ రిషి ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. కోర్ట్‌రూమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సిరీస్ తెలుగు ఓటీటీ ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేసేందుకు సిద్ధమైంది. జీ5 ఈ వెబ్ సిరీస్‌ను జూలై 31 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు విడుదల చేసిన పోస్టర్ సిరీస్‌పై ఆసక్తిని మరింత పెంచుతోంది. పోస్టర్‌లో శ్రీకాంత్, ముఖేష్ రిషి ఒకరినొకరు తీవ్రంగా ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తుండగా, దిగువన మంటల్లో చిక్కుకున్న వ్యక్తి విజువల్ కథపై మరింత ఉత్కంఠను రేకెత్తిస్తోంది. న్యాయం, నేరం, కుట్రల నేపథ్యంలో సాగే కోర్ట్‌రూమ్ థ్రిల్లర్‌గా ఈ సిరీస్ రూపొందినట్లు పోస్టర్‌ను బట్టి అర్థమవుతోంది. ఈ వెబ్ సిరీస్‌కు సంతోష్ అయ్యప్పన్ దర్శకత్వం వహించగా, డ్రీమ్ హౌస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్‌కుమార్ ఆకెళ్ల నిర్మించారు. అరుణ్ చిలువేరు సంగీతాన్ని అందించారు.




Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**